జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 5 సంచిక - 20 పక్షపత్రిక అక్టోబర్ 16 -31, 2014

## మలాలా, కైలాష్‌లకు నోబెల్ శాంతి బహుమతి



లోక్‌సత్తా తెలంగాణ రాష్ట్ర ప్రథమ మహాసభ ప్రతిపాదిత తీర్మానాలు

స్వచ్ఛ్‌భారత్ - సవాళ్ళు

# హుద్ హుద్ తుఫాను దృశ్యాలు

















జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక అక్టోబర్ 16-31, 2014

సంపుటి - 5 సంచిక - 20

## లోపలి పేజీల్లో...


శాంతి కపోతం... శైశవగీతం.......6

మెదడులో దిక్సూచి ఆవిష్కరణకు నోబెల్....... 9

ఉన్నత విద్యలో జిల్లాదో తీరు....... 10

విశ్వవిద్యాలయాల చట్టాలకు సవరణలు....... 11

ప్రభుత్వ ప్రకటనలను రాజకీయ లబ్ధికి ఉపయోగించరాదు.... 12

తెలంగాణ రాష్ట్ర ప్రథమ మహాసభ....... 13

తెలంగాణ సమాచారం....... 21

సాయుధ....... 23

వలసలను తట్టుకునేందుకు శాటిలైట్ సిటీలు....... 25

అందరి కోసం నగరాలు....... 26

నగరాలకు ప్రణాళిక లోపమే పెనుశాపం....... 28

రేడియో అక్కయ్య ఇక లేరు.......31

గాంధీజీ ప్రేరణతో జపాన్ సాజీ....... 32

స్వచ్ఛ్ భారత్ - సవాళ్లు....... 33



## సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

**డి.వి.వి.యస్. వర్మ**
సంపాదకులు

**సంపాదక వర్గం**
పి. రవిమారుత్
బండారు రామ్మోహన్‌రావు
ఓంకార్
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి


# ఈ పక్షం చాట్ మసాలా

1. మాఫియా కొమ్ము కాస్తున్న చంద్రబాబు - సి.పి.యం. నేత శ్రీనివాసరావు
   - కొమ్ము కాస్తున్నారా... కొమ్ములు మొలిపిస్తున్నారా
2. మంత్రి గంటాపై అయ్యన్న మండిపాటు
   - మందేమంత్రులకు పచ్చగడ్డి దొరికింది
3. మాసిన గెడ్డాలతో తమిళమంత్రులు
   - జయకు బెయిల్ వచ్చేనాటికి వీరంతా మహామునులైపోతారు
4. లోకేష్ పార్టీకోసం పనిచేస్తే తప్పా - చంద్రబాబు
   - పార్టీకోసం చేస్తే తప్పుకాదు కాని - ఆయన కోసం పార్టీని పని చేయిస్తేనే తంటా
5. బాబుతో చర్చించే దమ్ము కే.సి.ఆర్‌కు వుందా - లోకేష్
   - భేష్ లోకేష్ - కె.టి.ఆర్‌తో చర్చించే దమ్ము తమకుందా అంటున్నారు
6. పాడి రైతులకు క్షీరసాగర పథకం - మంత్రి గంటా
   - క్షీర సాగరమే తెస్తే... పాడి రైతులెందుకు
7. సి.యం. అభ్యర్థిగా సూపర్ స్టార్ రజనీకాంత్ - బి.జె.పి. నేత అమిత్‌షా
   - తమిళనాట స్టార్ వార్స్ తప్ప మార్గంలేదని కనిపెట్టారు
8. మీడియాకు ఈ.సీ అవార్డులు
   - ఈ.సీకి రియల్ న్యూస్ - అభ్యర్థులకు పెయిడ్ న్యూస్
9. ఎర్రచందనం వేలం మళ్లీ వాయిదా
   - బేరం కుదరకపోతే వాయిదా తప్పదుగదా
10. విశ్వవిద్యాలయాల చట్టాన్ని మారుస్తాం - రాష్ట్రమంత్రి
    - చట్టాన్ని మారిస్తే విశ్వవిద్యాలయాలు మారిపోతాయా
    **మంత్రాలకు చింతకాయలు రాలవు**
11. జన్మభూమిలో వినతుల వెల్లువ
    - వినతుల వెల్లువ - పరిష్కారాలు మెల్లన

❖ ❖ ❖




# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

ఫోన్ : **040-23310288**
ఫోన్ / ఫ్యాక్స్ : **040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311817**

విడి ప్రతి : రు. *10* ,
ఏడాది చందా : రు. *200*
మూడేళ్ళ చందా : రు. *500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# మహా నగరానికి ఘోర విపత్తు
# పంటల్ని బలిగొన్న పెనుతుఫాను

సంపాదకీయం

మహానగరంగా ఎదుగుతున్న విశాఖపట్నానికి పెనుతుఫాను ఘోర విపత్తును తెచ్చిపెట్టింది. పేదల ఇళ్లను నేలమట్టం చేసింది. పెద్దల ఇళ్లు బీటలు వారాయి. పచ్చనిచెట్లు కూలిపోయాయి. విద్యుత్‌స్తంభాలు విరిగిపడ్డాయి. రైళ్లు బస్సులు నిలిచిపోయాయి. రోజుల తరబడి కరెంటు లేదు. నీళ్లు లేవు. ఫోన్లు మూగపోయాయి. జనజీవనం పూర్తిగా స్తంభించి పోయింది.

ఈసారి తుఫాను హెచ్చరికలలో లోటుపాట్లు లేవు. గాలి తీవ్రత, తీరందాటేచోటు, సమయం అన్నీ ప్రకటించినట్లుగానే జరిగిపోయాయి. రాష్ట్రప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం సకాలంలో స్పందించాయి. ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నాయి. ప్రాణనష్టాన్ని నివారించడంలో, పునరావాస కేంద్రాల ఏర్పాటులో తగిన జాగ్రత్తలు తీసుకున్నాయి. కాని పెనుతుఫాను మాత్రం నగరాన్ని నరకంచేసి పోయింది. ముఖ్యమంత్రి అక్కడే మకాం పెట్టారు. ప్రధాని స్వయంగా వచ్చారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా వెంటనే **1000** కోట్లు తొలివిడత సహాయాన్ని ప్రకటించారు.

విశాఖ , విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల ప్రజల కష్టాలలో పాలు పంచుకోడానికి రాష్ట్రం అంతా స్పందించింది. వివిధ సంస్థలు, వ్యక్తులు ధన, వస్తు, రూపాలలో తోడ్పాటునందిస్తున్నారు. తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వంతోపాటు ఇతర రాష్ట్రప్రభుత్వాలు సహాయం అందించాయి.   ఇవన్నీ ఎంతో ఊరట నిచ్చే అంశాలు. తక్షణం పౌరజీవనాన్ని యధాస్థితికి తేవడం ప్రధమ కర్తవ్యం అవుతుంది. ఒక్క పక్క తుఫాను నగరం రూపురేఖల్ని మార్చివేస్తే దానికి కొత్తరూపం ఇవ్వడం పునర్నిర్మాణ కర్తవ్యం కావాలి. కేంద్రం ప్రకటించిన స్మార్ట్‌సిటీ, రాష్ట్రం ప్రకటించిన మెగాసిటీగా విశాఖ రూపొందాలి. కూలిన  పేదల ఇళ్లకు నష్టపరిహారంతో సరిపెట్టుకోకుండా , మురికివాడల స్థానంలో అన్ని వసతులు గల భవనాలు నిర్మాణం కావాలి. ట్రాఫిక్ ఇబ్బందుల్ని అధిగమించే రోడ్ల నిర్మాణం జరగాలి. పచ్చదనాన్ని చిగురింపజెయ్యాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలి మెగా సిటీగా విశాఖ పునరుద్ధానం జరగాలి.

ఆంధ్రప్రదేశ్‌కు సముద్రతీరం ఒక పక్క వరం అయితే అదే మరోపక్క రైతుల పాలిట తుఫానుల రూపంలో శాపంగా వుంది. ప్రతి ఏటా ఒకటికి రెండుసార్లు తుఫానులు పంటల్ని బలితీసుకుంటున్నాయి.  ఇప్పుడు ఉత్తరాంధ్ర మూడు జిల్లాలో వరి, చెరుకు, అరటి తదితర పంటలన్నీ తుఫాను పాలయ్యాయి. బీమా కంపెనీలలో మాట్లాడతానని ప్రధాని భరోసా ఇచ్చారు. కాని ఇది తాత్కాలికం కారాదు. తుఫాను బీభత్సాల నష్టాల నుండి రైతులకు విముక్తి కలిగించేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తామే ప్రీమియం చెల్లించే విధంగా రైతులకు  నష్ట పరిహారం నేరుగా అందేలా ఏర్పాట్లు చెయ్యాలి.

ఇక కౌలు రైతుల గోడు చెప్పనక్కరలేదు. వారికి రుణమాఫీలు,  పావలా వడ్డీలు, పంటనష్టాల పరిహారాలు దాదాపుగా వర్తించని స్థితి వుంది. తక్షణమే భూయజమానులలో భయాందోళనలు తొలిగిపోయే విధంగా పాత కౌలుదారీ చట్టాన్ని రద్దు చేసి దాని స్థానంలో సరళతరమైన కాంట్రాక్టు పద్ధతి గల చట్టాన్ని తెచ్చి వారికి అన్ని  ప్రభుత్వ రాయితీలు, బీమా సదుపాయాలు వర్తింపజెయ్యాలి. ఇక తీరప్రాంతంలో మత్స్యకారుల జీవన స్థితిని, నివాస స్థితిని మార్చే ఏర్పాట్లు చెయ్యాలి. లేకపోతే వారి జీవితాలు  దిన దినగండంగా వున్నాయి.

తుఫాను బాధిత కుటుంబాలన్నింటికీ లోక్‌సత్తా పార్టీ తన ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తున్నది. సహాయం పునరావాస కార్యక్రమాలలో  లోక్‌సత్తా పార్టీ సభ్యులంతా ప్రత్యక్షంగా పాలు పంచుకోవలసిందిగా విజ్ఞప్తి  చేస్తున్నాం.



# శాంతి కపోతం... శైశవగీతం

- బాలల హక్కుల సారథులు కైలాశ్ సత్యార్థి,
- మలాలా యూసఫ్‌జాయ్‌లకు "నోబెల్ శాంతి" పురస్కారం
- బాలకార్మిక వ్యవస్థపై 30 ఏళ్లుగా పోరాడుతున్న సత్యార్థి
- గాంధేయపద్ధతుల్లో ఉద్యమం
- బాలికల విద్య కోసం బుల్లెట్లను ఎదుర్కొన్న మలాలా
- అతిపిన్న వయసులో ప్రతిష్ఠాత్మక పురస్కారం

సరిహద్దు ఉద్రిక్తతలు భారత్-పాకిస్థాన్ మధ్య భగ్గుమంటున్న తరుణంలో.. నోబెల్ శాంతి బహుమతి ఇరుదేశాల మధ్య పన్నీటిజల్లు కురిపించింది. వెట్టిచాకిరి నుంచి బాలలను విముక్తి చేయటానికి పాటుపడుతున్న మనదేశానికి చెందిన కైలాశ్ సత్యార్థి, బాలికల విద్య కోసం ప్రాణాలను కూడా పణంగా పెట్టి పోరాడుతున్న పాకిస్థాన్ బాలిక మలాలా యూసఫ్‌జాయ్‌లను ఈ ఏడాది నోబెల్ శాంతిబహుమతి వరించింది. చిన్నారుల విద్య కోసం ఉద్యమిస్తూ.. తీవ్రవాదానికి వ్యతిరేకంగా గళమెత్తుతూ ఒక హిందూ-ఒక ముస్లిం, ఒక భారతీయుడు-ఒక పాకిస్థానీ ఉమ్మడి పోరాటంతో మమేకం కావటాన్ని ముఖ్యమైన పరిణామంగా పరిగణిస్తున్నామని నోబెల్ బహుమతిని అందించే "నార్వే నోబెల్ కమిటీ" పేర్కొంది. చిన్నారులు, యువతపై అణిచివేతకు వ్యతిరేకంగా, బాలల విద్యాహక్కులకు అనుకూలంగా వీరిద్దరూ ఉద్యమించారని.. దీనికి గుర్తింపుగానే వీరిని నోబెల్ శాంతి బహుమతికి ఎంపిక చేశామని తెలిపింది. వీరిద్దరికీ కలిపి డిసెంబరులో 11 లక్షల డాలర్ల (దాదాపు రూ.6.7 కోట్లు) మొత్తాన్ని అందజేయనుంది.

**ఉన్నతోద్యోగాన్ని వదిలిపెట్టి:** మదర్ థెరెసా తర్వాత నోబెల్ శాంతి బహుమతికి ఎంపికైన రెండో భారతీయుడు కైలాశ్ సత్యార్థి. 60 ఏళ్ల వయసున్న సత్యార్థి ఎలక్ట్రిక్ ఇంజినీర్ ఉద్యోగాన్ని వదిలిపెట్టి.. చిన్నారులను వెట్టిచాకిరి నుంచి విముక్తి చేసే లక్ష్యానికి అంకితమయ్యారు. 1980లో "బచ్‌పన్ బచావో ఆందోళన్" అనే సంస్థను స్థాపించి గత మూడుదశాబ్దాలకు పైగా పిల్లల హక్కుల కోసం కృషి చేస్తున్నారు. ఇప్పటివరకూ దాదాపు 80 వేల మంది చిన్నారులకు నిర్బంధశ్రమ నుంచి విముక్తి కల్పించారు. శాంతియుతంగా గాంధేయ పద్ధతుల్లో ఆయన నిర్వహించిన ఉద్యమాలను నోబెల్ కమిటీ ప్రశంసించింది. పిల్లల శ్రమను దోపిడీ చేసే వారిని ఆయన ఎంతో ధైర్యంతో ఎదుర్కొన్నారని



తన ప్రకటనలో పేర్కొంది. పిల్లల హక్కులపై జరిగిన ముఖ్యమైన అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని ఆయన అమూల్యమైన సూచనలు చేశారని తెలిపింది.

**తాలిబన్లకూ లొంగని ధీరత్వం :** 17 ఏళ్ల మలాలా బాలికల విద్య కోసం ఉద్యమిస్తున్నారు. ఈ క్రమంలో రెండేళ్లక్రితం తాలిబన్ల చేతుల్లో తుపాకి కాల్పులకు గురై మరణం అంచుల వరకూ వెళ్లారు. తీవ్రంగా గాయపడిన ఆమెను పాకిస్థాన్ నుంచి విమానంలో బ్రిటన్‌కు తరలించి బర్మింగ్‌హమ్‌లోని క్వీన్ ఎలిజబెత్ ఆసుపత్రిలో చాలాకాలంపాటు చికిత్స ఇచ్చారు. ఈ ఘటనతో మలాలా కృషికి అంతర్జాతీయంగా గుర్తింపు లభించింది. తాలిబన్ల బెదిరింపులకు లంగకుండా ఆ తర్వాత కూడా పిల్లల హక్కులు, బాలిక విద్య కోసం మలాలా ప్రచారం నిర్వహించారు. గత ఏడాది ఐక్యరాజ్యసమితిలో ఆమె ప్రసంగించారు. టైమ్ మ్యాగజీన్ ప్రకటించిన అత్యంత ప్రభావపూరిత వందమంది వ్యక్తుల్లో ఒకరిగా నిలిచారు. తనకు ఎదురైన అనుభవాలను తెలియజేస్తూ మలాలా గత ఏడాది ఒక పుస్తకాన్ని కూడా వెలువరించారు. ప్రస్తుతం అత్యంత పిన్నవయసులో నోబెల్ పురస్కారాన్ని గెల్చుకున్న వ్యక్తిగా రికార్డు సృష్టించారు. దీనిపై నోబెల్ కమిటీ స్పందిస్తూ.. "చిన్నవయసులో ఉన్నప్పటికీ మలాలా ఎన్నో ఏళ్లుగా బాలికావిద్య కోసం పోరాడుతున్నారు. అత్యంత ప్రమాదకర పరిస్థితుల మధ్య కూడా ఆమె తన కృషిని కొనసాగించారు. తన వీరోచిత పోరాటం ద్వారా బాలికల విద్యాహక్కులకు ఆమె ఒక ప్రముఖ ప్రతినిధిగా ఎదిగారు. తమ పరిస్థితులను తామే స్వయంగా మెరుగుపరుచుకోగలమని పిల్లలకు, యువతకు ఒక ఉదాహరణగా నిలిచారు" అంటూ ప్రకటనలో ప్రశంసలు కురిపించింది.



కైలాశ్ సత్యార్థి, మలాలా యూసఫ్‌జాయ్‌లను నోబెల్‌శాంతి బహుమతి విజేతలుగా ప్రకటించిన అనంతరం వారి చిత్రాలు చూపుతున్న పురస్కార కమిటీ సారథి జగ్‌ల్యాండ్

**విముక్తి పోరుకు గుర్తింపు:** తనను నోబెల్ శాంతి బహుమతికి ఎంపిక చేయటంపై కైలాశ్ సత్యార్థి స్పందిస్తూ.. బానిసత్వంలో మగ్గుతున్న కోట్లాదిమంది పిల్లల విముక్తి కోసం జరుగుతున్న పోరాటానికి ఇది పెద్ద గుర్తింపని చెప్పారు. ఆ చిన్నారుల్లో ప్రతీ ఒక్కరూ స్వేచ్ఛను పొందేవరకూ తన పనిని ఆపబోనని స్పష్టం చేశారు. ఈ అధునిక యుగంలో కూడా అనేక అవస్థలు పడుతున్న బాలల కష్టాలను గుర్తించిన నోబెల్ కమిటీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. తనకు దక్కిన పురస్కారాన్ని భారత ప్రజానీకానికి అంకితం చేస్తున్నానని పేర్కొన్నారు. "మహాత్మాగాంధీ మరణించిన తర్వాత నేను పుట్టాను. నోబెల్ శాంతి బహుమతిని నాకన్నా ముందు మహాత్మాగాంధీకి ఇస్తే నేను మరింత సంతోషించి ఉండేవాడిని" అని చెప్పారు. తనతోపాటు నోబెల్ శాంతి బహుమతికి ఎంపికైన మలాలాకు ఆయన అభినందనలు తెలిపారు. తామిద్దరమూ కలిసి పని చేయాల్సి ఉందని, ఇరుదేశాల (భారత్, పాకిస్థాన్) మధ్య శాంతి కోసం కృషి చేస్తామని చెప్పారు. సత్యార్థి నోబెల్‌కు ఎంపిక కావటంపై ఆయన భార్య సుమేధ.. ఇది వూహించని విషయమని, బాలల హక్కుల కోసం అంకితమై సాధారణ జీవితం గడుపుతున్న తన భర్తకు ఇంతటి గౌరవం లభించటం గొప్ప విషయమని హర్షం వ్యక్తం చేశారు. సత్యార్థికి నోబెల్ దక్కిన నేపథ్యంలో.. ఆయన స్థాపించిన "బచ్‌పన్ బచావో ఆందోళన్" సంస్థ తాలూకు వెబ్‌సైట్‌ను సందర్శించటానికి అనేకమంది పోటీపడటంతో ఆ వెబ్‌సైట్ నిలిచిపోయింది. మరోవైపు, సత్యార్థి ట్విట్టర్ ఖాతాకు అభినందనలు వెల్లువెత్తాయి. సత్యార్థి, మలాలాను "చిన్నారుల ప్రపంచ ఛాంపియన్లు" గా ఐరాస ప్రధాన కార్యదర్శి బాన్‌కీమూన్ అభివర్ణించారు. వారిద్దరికీ కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీతోపాటు పలువురు ప్రముఖులు అభినందనలు తెలియజేశారు.

**తరతరాలుగా హింస ప్రభావం**

నోబెల్ శాంతి బహుమతికి సత్యార్థి, మలాలాలను ఎంపిక చేసిన సందర్భంగా నోబెల్ కమిటీ ఒక ప్రకటన విడుదల చేసింది. "చిన్నారులు బడికి వెళ్లాలిగానీ ఆర్థికంగా దోపిడీకి గురి కాకూడదు. పేదదేశాల్లో 60 శాతం జనాభా 25 ఏళ్లలోపు వారే. పిల్లలు, యువతీయువకుల హక్కులను గౌరవించినప్పుడే ప్రపంచం శాంతియుతంగా అభివృద్ధి చెందుతుంది. సంక్షోభంలో చిక్కుకున్న ప్రాంతాల్లో చెలరేగే హింసాకాండ

పిల్లలపై తీవ్రప్రభావం చూపుతోంది. హింస ఒక తరం నుంచి మరో తరానికి కొనసాగటానికి ఇది కారణమవుతోంది" అని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా నేడు 16.8 కోట్ల మంది బాలకార్మికులు ఉన్నారని తెలిపింది. పిల్లల హక్కుల కోసం జరిగే పోరాటం దేశాల మధ్య సోదరభావాన్ని పెంపొందిస్తుందని, నోబెల్ బహుమతిని స్థాపించిన ఆల్ఫ్రెడ్ నోబెల్ ఆశయాల్లో ఇది కూడా ఒకటని వెల్లడించింది. ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతికి రికార్డు స్థాయిలో 278 మంది పేర్లను పరిశీలించారు. వీరిలో పోప్ ఫ్రాన్సిస్ కూడా ఉన్నారు.

**మన పౌరసమాజం సేవలకు గుర్తింపు ఇది**

కైలాశ్ సత్యార్థికి అభినందనలు. బాలకార్మిక సమస్య వంటి క్లిష్టమైన సామాజిక సమస్యల పరిష్కారానికి భారత్‌కు చెందిన చైతన్యపూరిత పౌర సమాజం చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని చూడాలి. **– రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ**

**దేశం గర్విస్తోంది**

నోబెల్ శాంతి బహుమతి పొందిన కైలాశ్ సత్యార్థికి అభినందనలు. ఈ ముఖ్యమైన విజయానికి మొత్తం దేశమంతా గర్విస్తోంది. మొత్తం మానవాళికి సంబంధించిన ఒక అంశానికి ఆయన జీవితాన్ని పూర్తిగా అంకితం చేశారు. సంకల్పబలంతో ఆయన చేసిన కృషికి నా వందనాలు.

మలాలా యూసఫ్‌జాయ్ జీవితం ధైర్యసాహసాలతో కూడిన ప్రయాణం. నోబెల్ శాంతి బహుమతి పొందిన ఆమెకు నా అభినందనలు. **–ప్రధాని నరేంద్రమోదీ**

# నాణ్యమైన విద్య ఎంత కీలకమో చెప్పిన నోబెల్ శాంతి

## మలాలా, కైలాష్‌లకు జేపీ అభినందనలు

పుట్టుకతో వివక్షను తొలగించటానికి ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్యను అందించటం ఎంత కీలకమో తాజా నోబెల్ శాంతి బహుమతి మరోసారి మనకు గుర్తుచేస్తోందని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. భారత్, పాకిస్థాన్‌కు చెందిన కైలాష్ సత్యార్థి, మలాలా యూసఫ్‌జాయ్‌కి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించటం దక్షిణాసియా ఉమ్మడి వారసత్వ సంస్కృతి పటిష్ఠతకు, ఉమ్మడి సమస్యల పరిష్కారానికి దోహదం చేస్తుందని అన్నారు.

కేవలం పుట్టుకతో వివక్ష వల్లే భారతదేశంలో కోట్లాదిమంది పిల్లలు తమ శక్తిసామర్థ్యాలను వికసింపచేసుకోలేక ఎదిగే అవకాశాల్ని కోల్పోతున్నారని జేపీ ఆవేదన వ్యక్తం చేశారు. యాదృచ్ఛికమైన పుట్టుక ఆధారంగా ఒక బిడ్డ భవిష్యత్తు నిర్ణయమైపోవటం కన్నా మహాపాపం మరోటి లేదన్నారు. ప్రజాస్వామ్యానికే అవమానకరమైన ఈ వివక్షను తొలగించటంలో మనం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అత్యధిక శాతం పిల్లలకు నాణ్యమైన చదువును అందకుండా చేస్తున్నామని, మనదేశ ప్రయోజనాలను భారీగా దెబ్బతీసుకుంటున్నామని అన్నారు.

మలాలా, కైలాష్ నోబెల్ శాంతికి అర్హులని జేపీ ప్రశంసించారు.

మన బహిరంగ ప్రదేశాలను, వ్యర్థ పదార్థాల నిర్వహణను సమూలంగా మార్చుకోవటానికి గొప్ప పారిశుద్ధ్య విప్లవం అవసరమని జేపీ అన్నారు. టాయిలెట్ల కన్నా టెలివిజన్లే ఎక్కువ ఉన్న దేశం మనదొక్కటేనని, ఇది మన ఆరోగ్యాన్ని, పరిశుభ్రతని, ఆత్మగౌరవాన్ని దిగజార్చే జీవనశైలి అని అన్నారు. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఏర్పాటుపై ఇప్పటికే ఎంతో ఆలస్యం జరిగిందన్నారు. ఇందుకోసం చొరవ చూపుతున్న ప్రధాని నరేంద్రమోదీ, తమ వంతు తోడ్పాటునందిస్తున్న సద్గురు జగ్గీ వాసుదేవ్ వంటి ఆధ్యాత్మిక నేతలు అభినందనీయులని అన్నారు.

హుదుద్ పెను తుఫానును ఎదుర్కోవటంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సమన్వయంతో వ్యవహరించటం మంచి పరిణామమని, తుఫాను తాకిడికి ఎక్కువగా గురయ్యే ఉత్తరాంధ్ర, తూర్పు గోదావరి జిల్లాల ప్రజలు అధికార యంత్రాంగానికి పూర్తిస్థాయిలో సహకరించాలని జయప్రకాష్ నారాయణ్ అమెరికా నుంచి విడుదల చేసిన ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# మెదడులో "దిక్సూచి" ఆవిష్కరణకు నోబెల్

## వైద్య విభాగంలో ముగ్గురికి దక్కిన పురస్కారం




మెదడులో దిశానిర్దేశం జరిగే తీరును వెలుగులోకి తెచ్చిన బ్రిటన్-అమెరికన్ జాన్ ఒ కీఫే, నార్వే జంట ఎడ్వర్డ్ మోసర్, మే-బ్రిట్ మోసర్‌లు వైద్యశాస్త్ర విభాగంలో నోబెల్ బహుమతి గెల్చుకున్నారు. ఖాళీ ప్రదేశంలో ఉన్నప్పుడు మన స్థితిని తెలుసుకోవడానికి దోహదపడే పొజిషనింగ్ వ్యవస్థ (అంతర్గత జీపీఎస్)ను కనుగొన్నందుకు వీరిని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు అవార్డు కమిటీ పేర్కొంది. ఈ పరిశోధన.. అల్జీమర్స్, మెదడుకు సంబంధించిన ఇతర వ్యాధులకు చికిత్సలు చేయడానికి దోహదపడుతుందని వివరించింది. "మన చుట్టూ ఉన్న ప్రదేశానికి సంబంధించిన మ్యాప్‌ను మెదడు ఎలా తయారుచేసుకుంటుంది? సంక్లిష్టమైన వాతావరణంలో మనం దిశానిర్దేశాన్ని ఎలా చేసుకుంటాం? ఇవి.. శతాబ్దాలుగా తత్వవేత్తలను, శాస్త్రవేత్తలను వేధిస్తున్న ప్రశ్నలు. వీటికి జాన్, ఎడ్వర్, మే బ్రిట్‌లు సమాధానాన్ని కనుగొన్నారు" అని ఎంపిక కమిటీ ప్రశంసించింది. 1971లో జాన్ ఈ వ్యవస్థలోని మొదటి అంశాన్ని కనుగొన్నారు. ప్రయోగశాలలోని నిర్దిష్ట ప్రదేశంలో ఉన్నప్పుడు ఎలుక మెదడులోని హిప్పోక్యాంపస్ భాగంలో కొన్ని కణాలు క్రియాశీలమవుతున్నట్లు గుర్తించారు. మిగతా చోట్ల ఉన్నప్పుడు మిగతా నాడీ కణాలు క్రియాశీలమవుతున్నట్లు కనుగొన్నారు. ఈ "ప్రదేశ కణాలు" గదికి సంబంధించిన మ్యాప్‌ను రూపొందించినట్లు జాన్ సూత్రీకరించారు. మూడు దశాబ్దాల తర్వాత ఎడ్వర్డ్ మోసర్, మే బ్రిట్‌లు ఈ అదృశ్య పొజిషనింగ్ వ్యవస్థకు సంబంధించి మరో అంశాన్ని వెలుగులోకి తెచ్చారు. రేఖాంశ, అక్షాంశాల తరహాలో ఒక సమన్వయ వ్యవస్థను రూపొందించే నాడీ కణాల (గ్రిడ్ కణాలు)ను గుర్తించారు. ఇవి మెదడులో మార్గనిర్దేశ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడానికి వీలు కల్పిస్తున్నాయి. అల్జీమర్స్ వ్యాధిగ్రస్థులు తాము ప్రయాణించాల్సిన మార్గాన్ని తరచూ మరచిపోతుంటారు. పరిసరాలను గుర్తించలేరని ఎంపిక కమిటీ పేర్కొంది. మెదడులోని దిక్సూచి వ్యవస్థ గురించి అవగాహన పెరగడం వల్ల ఈ రోగుల్లో ప్రాదేశిక జ్ఞాపకశక్తి క్షీణత వెనుక ఉన్న ప్రక్రియ గురించి తెలుసుకోవడానికి వీలవుతుందని వివరించింది.

తనకు నోబెల్ బహుమతి వచ్చిన సంగతి తెలిసి మే-బ్రిట్ మోసర్ తీవ్ర ఉద్వేగానికి గురయ్యారు. తాను "షాక్" లో ఉన్నానని ఆమె పేర్కొన్నారు. తన భర్త.. విమానంలో మ్యూనిక్‌కు వెళుతున్నారని, ఆయనకు ఇంకా ఈ విషయం తెలియదని వివరించారు. "మా ఇద్దరి దార్శనికత ఒకటే. మాకు ఆసక్తి ఉన్న అంశాల్లోని సవాళ్లపై పరస్పరం మాట్లాడుకుంటాం. ఇతరులతోనూ చర్చిస్తాం. వాటి పరిష్కారానికి కృషి చేస్తాం" అని తెలిపారు. జాన్ 1939లో, ఎడ్వర్డ్ 1962లోను, ఆయన భార్య మే బ్రిట్ మోసర్ 1963లో జన్మించారు. బహుమతి కింద అందే 11 లక్షల డాలర్లను వీరు పంచుకుంటారు. అయితే అందులో సగం సొమ్ము జాన్‌కు అందుతుంది. డిసెంబర్ 10న స్టాక్‌హోంలో బహుమతి ప్రదానోత్సవం జరుగుతుంది. నోబెల్ బహుమతి ప్రముఖ శాస్త్రవేత్త ఆల్ఫ్రెడ్ నోబెల్ వీలునామాకు అనుగుణంగా ఏర్పాటైంది. 1901లో దీన్ని మొదటిసారిగా అందజేశారు. ఏటా సైన్స్, సాహిత్యం, శాంతి విభాగాల్లో పురస్కారాలను ఇస్తుంటారు. ■

# ఉన్నత విద్యలో జిల్లాదో తీరు

ఉన్నత విద్య అందరికీ చేరువలో ఉండేలా చేస్తామని, రాష్ట్రాన్ని నాలెడ్జ్ హబ్‌గా మారుస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన నేపథ్యంలో... అధికారులు 13 జిల్లాల్లో ఉన్న కళాశాలల వివరాలపై నివేదికలు తయారుచేశారు. వీటిని పరిశీలించినప్పుడు విద్యార్థులకు ఉన్నత విద్య లభ్యతలో జిల్లాల వారీగా అసమానతలు స్పష్టంగా కనిపించాయి. ఒకటి రెండు జిల్లాల్లో ఇంజినీరింగ్ కళాశాలలు భారీగా ఉంటే, ఇంకొన్ని జిల్లాలో బీఎడ్ కళాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇంకొన్ని జిల్లాలో సంప్రదాయ పీజీ కశాశాలలకు ప్రాధాన్యం కనిపిస్తోంది. ఉత్తరాంధ్ర, రాయలసీమలోని కొన్ని జిల్లాల్లో కీలక కోర్సుల విద్యాసంస్థలు స్వల్ప సంఖ్యలోనే ఉన్నాయి. స్థానిక పరిస్థితులు, కోర్సుల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకోకుండా ఆయా ప్రాంతాల్లోని విశ్వవిద్యాలయాల ఆలోచనలకు తగినట్లు కోర్సులు ప్రారంభం కావడం ఇందుకొక ప్రధాన కారణం. నిర్దిష్ట ప్రణాళికలు లేకుండా యాజమాన్యాలు తమ అవసరాలకు అనుగుణంగా కళాశాలలను స్థాపించడం ఈ పరిస్థితికి మరో కారణంగా కనిపిస్తోంది. మొత్తానికి ఉన్నత విద్యలో అన్ని కోర్సులు అన్ని జిల్లాలో సమానస్థాయిలో లభ్యం కావడం లేదు. ఇష్టమైన కోర్సులు చదవడానికి విద్యార్థులు ఇతర జిల్లాలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ క్రమంలో బీఎడ్ కళాశాలలపరంగా గుంటూరు, ప్రకాశం జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. గుంటూరు, చిత్తూరు, విశాఖ, కృష్ణా జిల్లాలు ఉన్నత విద్య లభ్యత పరంగా ప్రత్యేకతను సంపాదించుకున్నాయి. విజయనగరం, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలు వెనుకబాటులో ఇంచుమించు ఒకేలా ఉన్నాయి.

**డిగ్రీ విద్యలో చిత్తూరు :** డిగ్రీ విద్యను అందించే కళాశాలలు చిత్తూరులో అధికంగా (135) ఉన్నాయి. దీని తర్వాత తూర్పుగోదావరి (131), గుంటూరు(123) జిల్లాల్లో ఎక్కువ కళాశాలలు ఉన్నాయి. తక్కువ కళాశాలలు కర్నూలు (66), అనంతపురం(66)లో ఉన్నాయి.

**ఇంజినీరింగ్‌లో గుంటూరు:** ఇంజినీరింగ్ కళాశాలలు అత్యధికంగా గుంటూరు జిల్లా(49)లో ఉన్నాయి. దీని తర్వాత చిత్తూరు (39), కృష్ణా (38) జిల్లాలు ఉన్నాయి. తక్కువగా శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలో 10, 16 వంతున ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. ఎంటెక్ కోర్సు నిర్వహణలో గుంటూరు(37) కృష్ణా (32), చిత్తూరు (26) జిల్లాలు ముందు వరుసలో ఉన్నాయి. బీఫార్మసీ, ఎంఫార్మసీ కోర్సులు గుంటూరు జిల్లాలోనే ఎక్కువగా నడుస్తున్నాయి. ఫార్మా-డి కోర్సు కూడా గుంటూరు జిల్లాలోనే 12చోట్ల నడుస్తోంది.

**ఎంసీఏ, ఎంబీఏలోనూ... :** ఎంసీఏ కళాశాలలు అత్యధికంగా గుంటూరు, చిత్తూరు జిల్లాలో 29 వంతున ఉన్నాయి. తక్కువగా శ్రీకాకుళం జిల్లాలో మూడు, కర్నూలులో 7, అనంతపురం జిల్లాలో 8 నడుస్తున్నాయి. ఎంబీఏ కోర్సులో కళాశాలలు కృష్ణాలో 47, గుంటూరు జిల్లాలో 46 ఉన్నాయి. తక్కువగా శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలో 9, 10 వంతున ఉన్నాయి.

**పీజీలో వైజాగ్ :** సాధారణ పీజీ విద్యను అందించే కళాశాలలు విశాఖపట్నం(50)లో ఉన్నాయి. ఆ తరువాత కృష్ణా (47), గుంటూరు (46) జిల్లాలు ఉన్నాయి. తక్కువగా శ్రీకాకుళం (12), కర్నూలు(24) జిల్లాలోనే ఉన్నాయి.

**మెడికల్/డెంటల్ కళాశాలల్లో :** మెడికల్/డెంటల్ కళాశాలలు నాలుగేసి చొప్పున విశాఖపట్నం, కృష్ణా, గుంటూరు జిల్లాలో ఉన్నాయి. అనంతపురం, ప్రకాశం, విజయనగరం జిల్లాలో ఒక్కొక్క కళాశాల వంతున ఉన్నాయి.

**బీఎడ్‌లో గుంటూరు-ప్రకాశం :** బీఎడ్ కళాశాలలు గుంటూరు, ప్రకాశం జిల్లాలో 43 వంతున ఉన్నాయి. తక్కువగా... శ్రీకాకుళం జిల్లాలో 16, విజయనగరంలో 20, నెల్లూరు జిల్లాలో 20 వంతున కళాశాలలు ఉన్నాయి.

**కొత్త వర్సిటీల రాకతోనైనా జాగ్రత్తపడాలి :** ఏపీ ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ విజయప్రకాష్ స్పందిస్తూ...రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్ష అభియాన్ (రూసా), పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి కొత్త విశ్వవిద్యాలయాలు రాబోతున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే 13 జిల్లాల్లో ఉన్న కోర్సులు, విద్యార్థుల ప్రవేశాల తీరు, స్థానిక ప్రాధమ్యాలను పరిగణనలోనికి తీసుకుని కొత్త కోర్సులు ప్రారంభిస్తే మంచి ఫలితాలుంటాయి. అన్ని ప్రాంతాల్లో ఉన్నత విద్యను అందుబాటులో ఉంచినట్లయితే ఆయా ప్రాంతాల విద్యార్థులు మధ్యలోనే చదువులకు దూరం కాకుండా కళాశాలలకు వచ్చే అవకాశం ఉంటుంది. ■

# విశ్వవిద్యాలయాల చట్టాలకు సవరణలు

- ఉప కులపతుల ఆధిపత్యానికి చెల్లుచీటీ
- అధ్యయనానికి ప్రత్యేక కమిటీ
- కసరత్తు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

విశ్వవిద్యాలయాల చట్టాలను సవరించడంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృష్టి సారించింది. నిపుణుల కమిటీ ఏర్పాటుచేసి అధ్యయనం చేయించాలని ఏపీ మానవ వనరుల అభివృద్ధి శాఖ భావిస్తోంది. విద్యారంగంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక గుర్తింపు తేవాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంకల్పం మేరకు విశ్వవిద్యాలయాల విషయంలో చేపట్టాల్సిన చర్యలపై ఈ కసరత్తు ప్రారంభమైంది. అందులో భాగంగానే కాలంచెల్లిన విశ్వవిద్యాలయ చట్టాలను ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా మార్చాల్సిన అవసరాన్ని ప్రభుత్వ వర్గాలు గుర్తించాయి. చాలా వర్సిటీల చట్టాలూ 1991 కంటే ముందు వివిధ దశల్లో రూపొందినవి కావడం గమనార్హం.

**ఇవీ లోపాలు.. :** ప్రభుత్వం ఒకసారి ఉప కులపతిని నియమించిన తరువాత తొలగించాలంటే అది చాలా క్లిష్టమైన ప్రక్రియ. ఉపకులపతుల నియామకాలు రాజకీయ, సామాజిక, ప్రాంతీయ కోణాల్లో సిఫార్సులు, పలుకుబడులతో జరుగుతున్నాయి. ఇలా నియమితులవుతున్నవారి తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే, తీవ్రస్థాయిలో ఆరోపణలు వచ్చినా ఉపకులపతులను వెంటనే తొలగించడం కుదరదు. అక్రమాలపై కమిటీలను వేసినా విచారణ సమయంలో ఉపకులపతులు తమ పదవుల్లో కొనసాగుతారు. పదవీ విరమణ చేసిన న్యాయమూర్తి విచారణ జరిపి ఇచ్చిన నివేదిక ప్రకారం మాత్రం ఓ విశ్వవిద్యాలయ ఉపకులపతిని తొలగించిన సందర్భం ఉంది.

ప్రస్తుతం విశ్వ విద్యాలయాల్లో ఆర్థిక కార్యకలాపాల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. అనుబంధ కళాశాలల గుర్తింపు మూసపద్ధతిలో సాగుతోంది. బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలూ వివాదాస్పదమవుతున్నాయి. తాత్కాలిక నియామకాలు సరేసరి. ఉపకులపతి, ఇతర కీలక స్థానాల్లో ఉండే వారి సన్నిహితులు, సిఫార్సులతో ఈ నియామకాలు జరుగుతున్నాయి. కొన్నిచోట్ల విశ్వవిద్యాలయాల రిజిస్ట్రార్లు, ఇతర విభాగాల డీన్లుగా ఉపకులపతి అనుయాయులను మాత్రమే నియమిస్తున్నారు.

**పదవీకాలం ముగుస్తున్నా..:** వచ్చే నెల 9 నాటికి విక్రమ సింహపురి, జేఎన్‌టీయూ (కాకినాడ), శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాల ఉపకులపతుల పదవీకాలం ముగియనుంది. అంతకు నాలుగైదు నెలల ముందుగానే ఆ నియామకాల ప్రక్రియ ప్రారంభం కావాల్సిఉంది. అయితే.. ఇప్పటివరకు తదుపరి చర్యలపై దృష్టిపెట్టలేదు. ఈ నియామకాలు చేపట్టాలంటే.. సంబంధిత విశ్వవిద్యాలయాలు పాలకమండలి సమావేశంలో ఒకరిని "అన్వేషణ బృందం" లో సభ్యుడిగా ఉండాలని సూచిస్తూ తీర్మానించాలి. అనంతరం యూజీసీకి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసి మరో సభ్యుడినీ నియమించాలి. ఈ అన్వేషణ కమిటీకి ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు లేదా ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి నేతృత్వం వహిస్తారు. ఈ కమిటీలో సభ్యులను నియమించాలన్నా.. కేంద్రంతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాలన్నా తగిన వ్యవధి అవసరం. ఈ పరిస్థితుల్లో వచ్చే నెలలో పదవీ విరమణ చేసే ఉపకులపతుల స్థానంలో కొత్తవారి నియామకాల విషయమై ఉన్నత విద్యా మండలి సంబంధిత వర్సిటీలకు లేఖలు రాయనుంది. ఈ నియామకాలు సకాలంలో జరిగే అవకాశం లేనందున ఐ.ఎ.ఎస్.లు కానీ, సమీప వర్సిటీల ఉపకులపతులు కానీ అదనపు బాధ్యతలు స్వీకరిస్తారు.

### చట్టాల్లో మార్పులు తెస్తాం

విశ్వవిద్యాలయాల చట్టాలు ప్రస్తుత అవసరాలకు తగినట్లుగా లేవు. ఈ విషయాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. త్వరలోనే నిష్ణాతులతో కమిటీ వేయించి ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా చట్టాల్లో మార్పులు తెస్తాం. ■

**– గంటా శ్రీనివాసరావు, మంత్రి,**

ఏపీ మానవ వనరుల అభివృద్ధి శాఖ

# ప్రభుత్వ ప్రకటనలను రాజకీయ లబ్ధికి ఉపయోగించరాదు

## సుప్రీంకోర్టు కమిటీ సిఫార్సు



**ప్రభుత్వం ఇచ్చే ప్రకటనల్లో (అడ్వర్టైజ్‌మెంట్లు) రాజకీయ పార్టీల అధ్యక్షులు, ఆఫీస్ బేరర్ల పేర్లు, బొమ్మలు వాడరాదని సుప్రీంకోర్టు నియమించిన ఉన్నతస్థాయి కమిటీ ఒకటి సిఫార్సు చేసింది. ప్రభుత్వ ప్రకటనల్లో పేర్కొనే అంశాలు, వ్యయాన్ని నియంత్రించడానికి ఈ కమిటీ మార్గదర్శకాలను రూపొందించింది. నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించింది.**

నివేదికలోని ముఖ్యాంశాలు...

- రాష్ట్రపతి, ప్రధాని, గవర్నర్లు, ముఖ్యమంత్రుల పేర్లు, బొమ్మలు మాత్రమే ప్రకటనల్లో ప్రచురించాలి. రాజకీయాలను పక్కనపెట్టాలి.
- ఎన్నికలకు ఆరు నెలల ముందు అటువంటి ప్రకటనలపై తీవ్ర నియంత్రణలు ఉండాలన్న ఎన్నికల సంఘం సిఫార్సులు సబబే. ప్రకటనల నిషేధానికి ఒక గడువును నిర్ధారించాలి. అందుకు ఎన్నికల సంఘానికి అధికారం ఇవ్వాలి.
- ప్రముఖుల జయంతులు, వర్ధంతులు వంటి సందర్భాల్లో ఒకే ఒక ప్రకటన రావాలి. అది కూడా సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ నుంచి వెలువడాలి.
- ప్రభుత్వ ప్రకటనలకు అయ్యే వ్యయాన్ని, బడ్జెట్‌ను ప్రతి మంత్రిత్వశాఖా, ప్రభుత్వ రంగ సంస్థా ప్రకటించాలి. ఈ వ్యయాన్ని కాగ్ పరిశీలించాలి.
- అంబుడ్స్‌మన్ లేదా కేబినెట్ కార్యదర్శి లేదా సమాచార ప్రసార శాఖ కార్యదర్శి నేతృత్వంలో అమలు కమిటీ ఉండాలి.
- అధికార పార్టీ ప్రయోజనాలకు, విపక్షాలపై విమర్శలకు ప్రభుత్వ ప్రకటనలను ఉపయోగించరాదు.
- చట్టబద్ధమైన సందేశానికి, రాజకీయ సందేశానికి మధ్య స్పష్టమైన తేడా ఉండాలి. ఇందుకు ఒక చట్టం రూపొందించాలి. ■

## "లోక్‌పాల్" దరఖాస్తుదారుల వెల్లడికి కేంద్రం నిరాకరణ

లోక్‌పాల్ ఛైర్‌పర్సన్, సభ్యుల పదవుల కోసం దరఖాస్తు చేసుకున్న వ్యక్తుల వివరాలు బహిర్గతపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం నిరాకరించింది. ఈ విషయంలో దరఖాస్తుదారులు, ప్రభుత్వం మధ్య పరస్పర విశ్వాసంపై ఆధారపడ్డ సంబంధం ఉందని, అంతేగాకుండా లోక్‌పాల్ వ్యవస్థ అమల్లోకి వచ్చే ప్రక్రియ ఇంకా పూర్తికావాల్సి ఉందని, అందువల్ల ప్రస్తుత దశలో వారికి సంబంధించిన సమాచారాన్ని వెల్లడించడం లేదని చెప్పింది. సమాచార హక్కు చట్టం కింద పీటీఐ వార్తాసంస్థ దాఖలు చేసిన ఒక దరఖాస్తుకు సిబ్బంది, శిక్షణ విభాగం(డీవోపీటీ) ఈ మేరకు సమాధానం ఇచ్చింది. లోక్‌పాల్ ఛైర్‌పర్సన్, సభ్యుల పదవులపై ఆసక్తి వ్యక్తంచేసిన వ్యక్తుల వివరాలు వెల్లడించాలని పీటీఐ తన దరఖాస్తులో కోరింది.



# లోక్‌సత్తా పార్టీ
# 8వ వార్షికోత్సవం



# తెలంగాణ రాష్ట్ర ప్రధమ మహాసభ

## ప్రతిపాదిత తీర్మానాలు

**అక్టోబర్ 26 , 2014 ఆదివారం**

**పద్మశాలి కళ్యాణమండపం, వెస్ట్‌మారేడ్‌పల్లి, సికింద్రాబాద్**



## లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర రాజకీయ తీర్మానం

# కొత్త రాష్ట్రం - కోటిఆశలు

జూన్ 2, 2014న దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. కొత్త రాష్ట్రంలో కోటి ఆశలతో ప్రజలు కొత్త ప్రభుత్వాలు ఎన్నుకున్నారు. ప్రభుత్వం ఏర్పడి 150 రోజులు అయింది. ఈ కొద్ది రోజుల్లోనే ప్రభుత్వ పనితీరును అంచనా వేయలేం. కానీ ప్రభుత్వం ఏ రంగాలకి ప్రాధాన్యత ఇస్తున్నది, పరిపాలన ఎలా చేయబోతుంది అనే అంశాలను బట్టి ఒక అవగాహనకు రావచ్చు. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితిని గమనిస్తే కొత్తగా వచ్చిన ప్రభుత్వం తనదైన రీతిలో తెలంగాణ రాష్ట్రంలో పరిపాలన చేయాలని ప్రయత్నిస్తుంది. దానికి అనుగుణంగా కొత్త పథకాలని, కొత్త ఆలోచనలని ప్రకటిస్తుంది. ఒక్క క్యాబినెట్ సమావేశంలోనే 43 నిర్ణయాలను ప్రవేశపెట్టి ప్రకటించడం విశేషం.

రాష్ట్రంలో వ్యవసాయ, విద్యుత్ సంక్షోభం ముంచుకొచ్చింది. మరోవైపు కరువు రక్కసి కోరల్లో రైతాంగం బాధపడుతుంది. నానాటికీ రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. గత ప్రభుత్వాల ముందుచూపు లేకపోవడం వల్ల విద్యుత్ సంక్షోభం మరింత కుంగదీస్తుంది. ఈ దశలో టీఆర్ఎస్ పార్టీ సాంప్రదాయ రాజకీయ పార్టీలైన టీడిపీ, కాంగ్రెస్ ల నుండి వలసలు ప్రోత్సహిస్తూ ఆ పార్టీల ఉనికిని ప్రశ్నించే స్థాయికి చేరింది. ప్రతిపక్షాలు కకావికలమయిపోయి ప్రభుత్వం మీద విమర్శల్ని ఎక్కుపెడుతున్నాయి. విద్యుత్ వ్యవసాయ సంక్షోభాన్ని ఆసరా చేసుకుని ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నాయి. ఈ దశలో మిగతా ప్రతిపక్షాల కంటే మనం ఏ విధంగా ప్రత్యేకమో చెప్పగలగాలి. నిర్మాణాత్మక ప్రతిపక్షంగా మనం వ్యవహరించాలి. తప్పును తప్పు, ఒప్పును ఒప్పు అనగలగాలి. కేవలం విమర్శ కోసమే విమర్శ చేస్తే మనం కూడా మిగతా ప్రతిపక్షాలలాగే చులకన అయిపోతాం.

రాజకీయాల్లో సమయాసమయాలు ఉచితానుచితాలు చూసి వ్యవహరించడం తప్పనిసరి. తెలంగాణలో తెలుగుదేశం, కాంగ్రెస్‌లు చేస్తున్న యాత్రలు, యాగీలు, విమర్శలు, అకాల రాజకీయ దాడిలో భాగమే అనవచ్చు. తెలంగాణలో ఇవాళ వున్న పరిస్థితులకు కారణం చెప్పాల్సివస్తే మొదట తెలుగుదేశాన్ని తరువాత కాంగ్రెస్ పార్టీలనే బాధ్యుల్ని చేయాలి. తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు చేసుకోవడం మొదలైందే ఆ పార్టీల హయాంలో. వరుసగా రెండు దశాబ్దాలుగా లోక్‌సత్తా ఎంత మొత్తుకుంటున్నా వ్యవసాయ, విద్యుత్ రంగాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేయడం వల్ల ఇప్పటికీ రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలు తెచ్చి ప్రైవేటు విద్యుత్ ప్లాంట్‌లను అనుమతించింది. అందులో ఒక్కటంటే ఒక్క ప్లాంట్‌ను కూడా తెలంగాణ ప్రాంతంలో ఏర్పాటు చేయలేదు. తెలంగాణలో అపారమైన బొగ్గు నిక్షేపాలు వున్నా, ప్రైవేటు విద్యుత్ ప్లాంట్లు అన్నీ కోస్తా ప్రాంతానికే పరిమితం చేశారు. రాష్ట్ర విభజన చట్టం పేర్కొన్న మేరకు విద్యుత్ రాకుంటే ఈ పార్టీలు ఎలాంటి ప్రకటనలు చేయడం లేదు. ప్రతిపక్షాల ధోరణి చూస్తుంటే రైతాంగంలో మరింత సంక్షోభాన్ని గందరగోళాన్ని సృష్టించి మరిన్ని ఆత్మహత్యలకు పూరిగొల్పేలా వుంది. ఇప్పటికైనా కొత్త రాష్ట్ర ప్రభుత్వం దీర్ఘకాలిక వ్యవసాయమ విధానాన్ని ప్రవేశపెట్టి లాభసాటి వ్యవసాయాన్ని సాకారం చేస్తే తప్ప పరిష్కారం లభించదు.

సంధికాలంలో సమస్యలుంటాయి. కాని కొత్త ప్రభుత్వం ఆరంభశూరత్వం ప్రకటించి అనేక ప్రకటనలు ఇస్తూ వాటి అమలుకు ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదు. రాష్ట్రంలో సమగ్ర సర్వే పేరిట చేసిన గందరగోళం అంతా ఇంతా కాదు. అదొక ప్రహసనంగా మార్చివేశారు. అలాగే పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో కొత్తగా 'ఫాస్ట్' విధానాన్ని ప్రవేశపెడతామన్న ప్రభుత్వం కోర్టు కేసులో ఇరుక్కుని ముందుకు వెళ్ళలేకపోతుంది. మీడియా సంస్థల పట్ల ముఖ్యమంత్రి కేసిఆర్ వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదు. చేసిన తప్పుకి తప్పనిసరి శిక్ష అవసరమే. ప్రాయశ్చిత్తం కన్నా మించిన శిక్ష లేదు. మనదాకా వస్తే అన్న విషయాన్ని మిగతా పత్రికలు ప్రజాస్వామ్యవాదులు ఆలోచించాలి. అలాగే ప్రత్యామ్నాయ

రాజకీయ వేదిక సభని భగ్నం చేయడం ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చర్య తేటతెల్లమయ్యింది. వెయ్యి ఆలోచనలను వికసించే భావజాల విస్తరణకు ప్రభుత్వాలు అడ్డంకిగా మారకూడదు.

మంచినీటి పథకానికి రాష్ట్రవ్యాప్తంగా మంచినీటి గ్రిడ్ ఏర్పాటు చేయడం మొదలుకొని స్థానిక ప్రభుత్వాలకి మన ఊరు – మన ప్రణాళిక ద్వారా ఒక సమగ్ర ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం స్వాగతించదగ్గదే. ఆశయాలు ఘనంగా వున్నా, ఆచరణ సరిగ్గా లేకపోతే ఇది ప్రచార ఆర్భాటంగానే మిగిలిపోవచ్చు. ఈ స్థితిలో లోక్‌సత్తా పార్టీ మరింత సమన్వయంతో వ్యవహరించవలసిన అవసరం వుంది. కొత్త ప్రభుత్వానికి కొంత సమయం ఇచ్చి వాటి లోపాలను ఎండగట్టవలసి ఉంది. అదను చూసి విమర్శ చేయాలి. కొత్త ప్రభుత్వానికి కొంత మంచైనా, చేడయినా చేయడానికి అవకాశం ఇవ్వాలి. ఇంకా నాలుగున్నర ఏళ్ళదాకా ఎన్నికలు లేవు. లోక్‌సత్తా పార్టీ ఎప్పటినుంచో ఓటుబ్యాంకు రాజకీయాలకు దూరంగా ఉంటుంది. రాష్ట్రంలో నేడు నెలకొన్న వ్యవసాయ, విద్యుత్ పరిపాలన వైఫల్యాలు రాత్రికి రాత్రే వచ్చినవి కావు. వీటికి లోక్‌సత్తా వద్ద సమగ్ర పరిష్కార మార్గాలున్నాయి. మనం రాజకీయంగా వీటిని ప్రజల్లోకి తీసుకెళ్ళాలి. ప్రభుత్వ ఆలోచనాతీరును మార్చాలి.

## దాన వీర శూర కేసీఆర్

గత నాలుగునెలల కేసీఆర్ పరిపాలన చూస్తే అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. పార్టీలో, ప్రభుత్వంలో కూడా నిర్ణయాలు తీసుకోవడంలో ప్రజాస్వామీకరణ లేకపోవడం, తనకు ఎంత మాట తోస్తే అంతే అనడం, మంత్రులు, నాయకుల ఊసు లేకపోవడం, కుటుంబ వారసత్వ పాలనకు దగ్గరవ్వడం ప్రస్తుత ముఖ్యమంత్రి చేస్తున్న పొరపాట్లను మనం ఎండగట్టాలి. 'దశావతారాలు' మాని ఒక ముఖ్యమంత్రిగా ఉమ్మడి నాయకత్వాన్ని పెంపొందించి పరిపాలన సాగించాలి.

కొత్త ముఖ్యమంత్రి కేసిఆర్ మాట్లాడితే రాజకీయ అవినీతిని దూరం చేస్తానని, రాజకీయ అవినీతికి పాల్పడితే తన కూతురయినా, కొడుకయినా సహించనని అంటున్నారు. విత్తొకటి పెడితే చెట్టొకటి మొలవదు. రాజకీయ అవినీతికి ఎన్నికల్లో డబ్బు, సారా పంపిణే ప్రధానమైంది. స్వయానా ముఖ్యమంత్రితో సహా ఇలా డబ్బు, సారా పంచి గెలిచినప్పుడు రాజకీయ అవినీతిని ఎలా పారద్రోలగలరో మనం ప్రశ్నించాలి. ప్రజాస్వామ్యం లోపాలకి మరింత ప్రజాస్వామమే అసలైన మందు. ప్రభుత్వ వైఫల్యాలను మరింత ప్రజాస్వామ్యంతో ఎదుర్కొవడమే మనం చేయాల్సింది. తొలి తెలంగాణ ప్రభుత్వం విఫలం కావాలని మనం కోరుకోవడం లేదు. అందుకు నిర్మాణాత్మక ప్రతిపక్షంగా లోక్‌సత్తా సాకారాత్మక ధోరణితో ప్రభుత్వం చేసే మంచి పనులకి సహకరిస్తూ వైఫల్యాలను ఎండకడుతూ ముందుకు పోవాలి. అంతిమంగా తెలంగాణ ప్రజలు విజయం సాధించాలి.

హక్కుగా పౌరసేవల చట్టం రావడానికి మనం రాజకీయంగా ప్రభుత్వం మీద వత్తిడి తీసుకురావాలి. అవినీతి నిర్మూలనకి పటిష్టమైన లోకాయుక్త దేశంలో లోక్‌పాల్ వ్యవస్థ ఏర్పాటుకి ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయాలి. వ్యవసాయ, విద్యుత్ రంగాల్లో సంక్షోభాన్ని తొలగించడానికి ప్రభుత్వాలు సరియైన విధానాలు అవలంభించడానికి ప్రజల్లో ఉద్యమాలు చేయాలి. స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం ఇంటి ముందు పాలన – కంటి ముందు ప్రభుత్వం ఆలోచనను సక్రమంగా అమలుచేసే క్రమంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలి. అంతిమంగా ప్రజా చైతన్యమే పరమావధిగా లోక్‌సత్తా సభ్యులు, కార్యకర్తలు ప్రజల నిత్యజీవన సమస్యలపై ఉద్యమించాలి.

## లోక్‌సత్తా విజయాల్ని ప్రచారం చేయాలి

సమాచార హక్కు చట్టం, సురాజ్య ఉద్యమం స్ఫూర్తితో ప్రజలకు హక్కుగా పౌరసేవలు, సహకార రంగంలో రాజ్యాంగ రక్షణకు 97వ రాజ్యాంగ సవరణ తీసుకురావడం, నేరచరితులకు చట్టసభలలో ప్రవేశంపై సుప్రీంకోర్టు తీర్పు నేషనల్ జ్యుడీషియల్ బిల్లు, గ్రామ న్యాయాలయాల చట్టం 2009 లోక్‌సత్తా పార్టీ సాధించిన సంస్కరణలను ప్రజల్లో ప్రచారం చేయాలి. ధాన్యం ఎగుమతులపై ఆంక్షల తొలగింపు, సాధికారత సమాఖ్య ద్వారా వికేంద్రీకరణ, దామాషా ఎన్నికల వ్యవస్థల కోసం ఉద్యమం ఇలాంటి మార్పులు సాధించడానికి ప్రజల్ని జాగృతం చేసి మార్పుకు సమాయత్తం చేయాలి. ■

# లోక్‌సత్తా పార్టీ సంస్థాగత లక్ష్యాలు

పునాది సరిగా లేని భవనంపైన ఎంత ఆర్భాటంగా నిర్మించినా ఎక్కువకాలం నిలవలేదు. అలాగే బలమైన పటిష్ఠమైన సంస్థాగత నిర్మాణం లేని పార్టీ శాఖలు ప్రజలపై ఏమాత్రం ప్రభావం చూపలేవు. టీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్, టీడీపీల నుండి రాజకీయ వలసలను ప్రోత్సహిస్తున్న సందర్భంగా ఆ రాజకీయ పార్టీలు కకావికలు అయిపోవటం, పునాదులు బీటలు వారటం మనకు స్పష్టంగా కనబడుతున్నది.

సరైన ప్రత్యామ్నాయం వైపు ప్రజలు చూస్తున్నా లోక్‌సత్తా వారి దృష్టిని పూర్తిగా ఆకర్షించలేకపోతున్నది. దీనికి కారణం, మన నిర్మాణంలో ఉన్న లోపాలు సరిచేసుకోకపోవడంగానే మనం భావించాలి. నియోజకవర్గ స్థాయిలో కొన్ని వందలమంది ఇప్పటికే మన సభ్యత్వం తీసుకునివున్నారు. వేలమంది మన పట్ల ఆసక్తితో ఉన్నారు. వీరిలో అత్యధికులు ఇనపకండరాలు, ఉక్కునరాలు కలిగిన యువత. వీరిని గుర్తించి పార్టీ కార్యకలాపాలలో భాగం చేయడం, నాయకత్వం అప్పగించడం, పోలింగ్ బూత్ స్థాయికి విస్తరించడం మనం చేపట్టాల్సిన బాధ్యత.

నాయకత్వం అప్పగించకుండా, చేసే పనిని ప్రోత్సహించకుండా, “నీవు లేకపోతే ఈ పని జరగదు, ఇందులో నీ భాగస్వామ్యం కీలకం, నువ్వు మాత్రమే చేయగలవు” అన్న విశ్వాసం కలిగించకుండా ఇది సాధ్యం కాదు. నియోజకవర్గంలో వందలమంది సభ్యులు ఉంటే ఏర్పాటు చేసుకున్న కమిటీలో ఎనిమిది మందికి మాత్రమే స్థానం ఉంది. ఎన్నిక జరిగిన మరుక్షణం నుంచి ఆ ఎనిమిది మందే బాధ్యతగా భావించడం సహజం. మిగతావారు మనల్ని పిలిచి పని అప్పగిస్తే చేద్దామన్న తలంపుతోనే ఉంటారు. కాబట్టి మండల, గ్రామ, డివిజను, వార్డు, బూత్ స్థాయిలకు మనం నాయకత్వాన్ని పంచాలి. అలాగే యువసత్తా, మహిళాసత్తా, ఎస్.సి/ఎస్.టి/బి.సి/మైనారిటీ సెల్స్ పేరుతో సర్వజనసత్తా మాణిక్యాల్ని గుర్తించాలి. బాధ్యత తీసుకునేవారిని ప్రోత్సహించాలి. నిరంతరం పనిలో నిమగ్నమయ్యేలా కార్యక్రమాలు రూపొందించాలి. చిన్నచిన్న ఫలితాలు సాధించడం, ఈ ఫలితాల నుంచి స్ఫూర్తిని పొందడం, వారిలో పదిమందికి ఇందులో భాగస్వామ్యం కల్పించడం మన నిత్యకృత్యం కావాలి.

ఒక నియోజకవర్గంలో పైరకంగా కొన్ని వేలమందికి స్పష్టమైన బాధ్యతలతో కూడిన నాయకత్వం అప్పగించడానికి అవకాశం ఉంది. మనం చేయాల్సిన పనిని పదిమందికి పంచడం ద్వారా మన పని తేలికవుతుందున్న విషయాన్ని గుర్తించాలి. అప్పుడు మనం కొత్త కార్యక్రమాల రూపకల్పన, నాయకత్వం గుర్తింపు, నిధుల సేకరణ, విస్తరణల మీద దృష్టి సారించగలుగుతాం.

ఆర్థిక వనరులు, పనిచేసే ఒక స్థావరం (కార్యాలయం), రోజువారీ కార్యక్రమాలు, నిత్యం సమీక్షలు లేకుండా ఎప్పటికీ ఫలితాలు రావు. ప్రతి ఒక్కరిలోని శక్తిని గుర్తించి మీరు చేయగలిగిన పనులను వారికి అప్పగించడం ద్వారా మనం గుణాత్మకంగా పార్టీని పెంచగలుగుతాం.

కీలకమైన ఆర్థిక వనరుల సేకరణ కూడా మనం విస్తరిస్తూ, కార్యక్రమాలు నిర్వహిస్తూ, నోరు తెరిచి అడగటం నేర్చుకుంటే చాలా సులువుగా సమకూరుతాయి. మన పట్ల ఆసక్తి ఉండి, సమయం ఇవ్వలేనివారు, ఇతరత్రా ఇబ్బందులు ఉన్నవారు విరాళాలు ఇవ్వడానికి, ప్రతి నియోజకవర్గంలో వందలమంది ఉన్నారని మనం విశ్వసించాలి.

ప్రతి నిత్యం మన కళ్ళ ముందు కనిపిస్తున్న సమస్యలు మనల్ని కదిలించాలి. నివారించదగ్గ అన్యాయాన్ని కొనసాగిస్తుంటే మన గుండె రగలాలి. అప్పుడు మాత్రమే మనం నిరంతరం ఉద్యమించగలం. “మీ సమస్యలు మేమున్నాం, మీ సహకారంతో పరిష్కరించుకుందాం'' అన్న విశ్వాసం కనిపించాలి. ఇక లోక్‌సత్తా ఘడియాలు ప్రారంభమైనాయని జనం ఒక్కసారి భావిస్తే, సాంప్రదాయ పార్టీల సంకెళ్ళు తెంచుకుని మన జెండా ఎత్తుకోవడం ఖాయం. నాయకత్వం దానిని అందిపుచ్చుకోవడానికి “విశాఖ ఉక్కు” లాంటి పటిష్ఠమైన నిర్మాణం చేయడం మన ముందున్న కర్తవ్యం. దానిని సాధించడంలో మనమందరం అలుపెరగక, అహర్నిశలూ శ్రమించాలి, నడుం కట్టాలి, కదం తొక్కాలి. ఈ రాజకీయాన్ని తిరగరాయాలి.

**దీనికి తెలంగాణ రాష్ట్ర ప్రథమ మహాసభలో మనమందరం ప్రతిన బూనాలి. రాబోయే 6 నెలల్లో కనీసం ఒక యాభై నియోజకవర్గాలలో ఇలాంటి నిర్మాణం, ప్రజాకార్యక్రమాలు చేయగలిగితే, ఈ రాష్ట్ర భవిష్యత్తుని దుర్మార్గపు సాంప్రదాయ పార్టీల బారి నుంచి తప్పించి, మనమే స్వర్ణాక్షరాలతో లిఖించగలుగుతాం. దానికి అందరం ఉద్యుక్తులం కావాలి.** ♦

# యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

**నీళ్ళు, నిధులు, నియామకాలు తెలంగాణ ఉద్యమంలో ట్యాగ్‌లైన్‌గా మారింది. తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్ఎస్ పార్టీ యువతకు ఇచ్చిన ప్రధాన హామీ ఇంటికోఉద్యోగం. కాని ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలయినా, ఈ వైపుగా ప్రయాణం ప్రారంభించలేదు.**

కోటీ ఆశలతో కొత్త తెలంగాణ రాష్ట్రంలో యువత ఉద్యోగాలకోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు అటుంచి, కనీసం ప్రైవేటు రంగంలోనయినా ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని ఆశించిన యువతకు నిరాశే ఎదురవుతుంది. కొత్త పారిశ్రామిక విధానం అవలంభిస్తామన్న ప్రభుత్వం కరెంటు కోతలతో ఉన్న పరిశ్రమలే మూతపడే పరిస్థితి వుంది. విద్యుత్ హాలిడేలు ప్రకటించడం వల్ల రోజువారీ కూలీల పరిస్థితి కష్టంగా వుంది. చాలా మంది పరిశ్రమలకు విద్యుత్ లేక రోజు కూలీలు ఇంట్లో వుండాల్సిన పరిస్థితి దీనికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలి.

కొత్త ఉద్యోగాల కల్పనకు తక్షన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వంలో విద్య, వైద్య, పోలీసు రంగాలలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి. హైదరాబాద్‌లో ఐ.టి. హబ్‌గా మార్చి ప్రైవేటురంగంలో కొత్త ఉద్యోగాలు లభించాలంటే హైదరాబాద్ నుంచి తరలిపోయే సాఫ్ట్‌వేర్ రంగాన్ని ప్రభుత్వమే హామీలిచ్చి ఆపగలగాలి.

కొత్త పారిశ్రామిక విధానాన్ని వెంటనే ప్రవేశపెట్టి సింగిల్‌విండో సిస్టమ్ ద్వారా కొత్త పరిశ్రమలను ఆహ్వానించాలి. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. గ్రామీణ ఉత్పత్తి రంగాన్ని పెంపొదించి చిన్న పరిశ్రమలను వికేంద్రీకరించాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కల్పించి నగరాలకి వలసలను అరికట్టాలి. గృహ నిర్మాణరంగంలో నైపుణ్యం గల కూలీలకి ఉపాధి కల్పించాలి. అసంఘటిత రంగ కార్మికులకి ఉద్యోగ భద్రతతో పాటు పెన్షన్, పీఎఫ్ (ప్రావిడెంట్ ఫండ్) సౌకర్యాల విస్తృతిని పెంచాలి. మనది యువభారత్ పెద్ద సంఖ్యలో ఉన్న యువతకి ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా యువ మానవవనరులను సద్వినియోగం చేసుకోవాలి. ఏదైమైనా కొత్త రాష్ట్రంలోయువతకి ఉపాధి అవకాశాలను పెంచి వారిలోని నిరాశ నిస్పృహలను పారద్రోలాలి. ■

---

### ఇంటి ముందు ప్రభుత్వం - కంటి ముందు పాలన

# మన ఊరు - మన ప్రణాళిక అమలు జరపాలి

తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ నుండి పార్లమెంటు వరకు ఎన్నికలు పూర్తయ్యాయి. గ్రేటర్ హైదరాబాద్, ఖమ్మం, వరంగల్ లాంటి కార్పొరేషన్లు, డీ- లిమిటేషన్ చేయాల్సిన మరో 10, 12 మున్సిపాలిటీల ఎన్నికలు జరగాల్సి వుంది. పంచాయతీ ఎన్నికలు పూర్తయినా, అధికార వికేంద్రీకరణ స్థానిక ప్రభుత్వాలకు నిధులు, విధులు అప్పగించడంలో కొత్త ప్రభుత్వం ఇంకా ఆలోచన దిశలలో ఉంది. తెలంగాణ రాష్ట్రానికి కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకురావడంలో జరుగుతున్న కసరత్తు మంచిదే. నివాసయోగ్యమైన గ్రామాలు ఏర్పడాలంటే అధికార వికేంద్రీకరణ ఎంత అవసరమో వాటికి అవసరమయిన నిధులని అక్కడే ఖర్చు చేయడం అంత అవసరం. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ ఎమ్మెల్యే రాజ్యమే నడిపిస్తుంది. మన ఊరు – మన ప్రణాళిక ఆలోచన మొదలు పెట్టిన ప్రభుత్వం రేపటి బడ్జెట్‌లో ఇప్పటికే వచ్చిన గ్రామ, పట్టణ ప్రణాళికలను అమలు చేయాలి. దానికి కావాల్సిన నిధుల్ని రేపటి రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించాలి. గల్లీలో సమస్యలకు ఢిల్లీ, హైదరాబాద్‌లోన పరిష్కారం వుండకూడదు. ఇంటిముందు ప్రభుత్వం – కంటి ముందు పరిపాలన దిశగా ముందుకు సాగాలి. దీనికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలి.

1. గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్యాలయాల బోర్డులను స్థానిక ప్రభుత్వాలుగా మార్చాలి.

2. 14వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపుని పెంచి నేరుగా పంచాయతీలకే చెల్లించాలి ■

మహిళాసత్తా

# మహిళా భద్రతపై ఉద్యమం

లోక్‌సత్తా పార్టీ ఆవిర్భావం నాటి నుండి కూడా, పుట్టిన ప్రతి ఆడపిల్ల ఎటువంటి వివక్షతకు గురికాకుండా సమాజంలో సమానంగా ఎదిగే పరిస్థితులను కల్పించాలని మహిళా సాధికారతకు లోక్‌సత్తా పార్టీ పోరాడింది. తెలంగాణ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఇటీవలే నియమించిన పూనం మాలకొండయ్య ఆధ్వర్యంలో ఏర్పరచిన మహిళాభద్రత కమిటీకి తగిన సూచనలు, సలహాలు మహిళాసత్తా అందజేసింది. ఆ సూచనలన్నీ అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం లోక్‌సత్తా విజయంగా భావించవచ్చు.

కానీ, సాంప్రదాయ రాజకీయ పార్టీలు మహిళ శ్రేయస్సుకి తాత్కాలిక సంక్షేమ పథకాల పేరు చెప్పి, ఎన్నికలలో "తమ గెలుపే లక్ష్యంగా" ప్రజలని ప్రలోభ పెట్టేలా డబ్బు, మద్యాన్ని ఏరులై పారిస్తూ రాజకీయం చేస్తున్నారు. దానికి తోడు మహిళలకు భద్రత కరువై ఎన్నో సమస్యలు ఎదుర్కోంటున్నారు.

**ప్రధానంగా మహిళలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలు :**

I. **అత్యాచారాలు :** దేశ, రాష్ట్ర రాజధానుల్లో కాక, రాష్ట్రంలోని ప్రధాన పట్టణాల్లో కూడా ఉద్యోగినులు, సామాన్య మహిళలు, చదువుకునే ఆడపిల్లలపై సహితం అత్యాచారాలు, దాడులు వంటి వైపరీత్యాలు ఎక్కువైపోయాయి. ప్రభుత్వం వారికి కనీస భద్రతను కల్పించకపోవడం దురదృష్టకరం.

**డిమాండ్స్ :**

1. ప్రతి నియోజకవర్గ పరిధిలో ఒక మహిళా పోలీస్‌స్టేషన్ వుండాలి. 2. మహిళల కొరకు ప్రత్యేకించి ఎమర్జెన్సీ నెంబరు ఏర్పాటు చెయ్యాలి. 3. సైబర్ నేరాలపట్ల కూడా ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టాలి. 4. ప్రతి జిల్లాకి ఒక మహిళా కోర్టును, ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చెయ్యాలి. 5. నగరాల్లోని అన్ని కూడళ్లలోనూ" సిసి కెమెరాలు" ఏర్పాటు చేసి మహిళలకి భద్రతను కల్పించాలి.

II. **మహిళా రిజర్వేషన్లు :** స్థానిక ప్రభుత్వాలలో 50 శాతం మహిళా రిజర్వేషన్స్ వల్ల మహిళల ప్రాతినిధ్యం మరింత పెరిగి, మహిళలు నిర్ణయాధికారాల్లో భాగస్వాము లయ్యారు. ఇకనైనా చట్టసభలలో రిజర్వేషన్లకు "మహిళా బిల్లు"ను జాప్యం లేకుండా ఆమోదించాలి.

III. **భ్రూణహత్యలు :** భ్రూణ హత్యలలో బాలికల మరణాలు ఎక్కువకావడంతో బాలికల నిష్పత్తి తగ్గుతూ వస్తోంది. ఆడపిల్ల అంటే ఆర్థికంగా భారంగా భావించే ఇటువంటి దుర్మార్గాలు చేయడానికి భయపడడం లేదు. మగ-ఆడ అనే వివక్షతలు చూపుతున్నారు.

IV. **మద్యనియంత్రణ :** రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తూ ఎన్నో కుటుంబాలను వేధిస్తున్న మరొక ప్రధాన సమస్య మద్యం ఒకటి. ఎన్నో లక్షల కుటుంబాలు చితికపోవడానికి, మహిళల బ్రతుకు నాశనం అవ్వడానికి ఈ మద్యం మహమ్మారే కారణము. ఖజానాన్ని నింపుకోవడమే లక్ష్యంగా, మద్యాన్ని ఆదాయ మార్గంగా ఎంచుకున్న పాలకులు వుండడం వల్లే... ఈ దారుణ పరిస్థితి ఏర్పడింది. వాటిపై గ్రామస్థాయి నుండీ ప్రజలు అందరికీ అవగాహన కల్పించడం కోసమే లోక్‌సత్తా పార్టీ - మహిళాసత్తా ఆధ్వర్యంలో రెండు పర్యాయాలు "మద్యనియంత్రణ చైతన్యయాత్రను" చేయడం జరిగింది.

**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో :** 2007 ఆగస్టు 17 నుండి అక్టోబర్ 2 వరకు మొదటి చైతన్యయాత్ర. మరల 2010 జూలై 7 నుండి 22వ తేదీ వరకూ రెండవసారి చైతన్యయాత్రలను నిర్వహించడం జరిగింది. గ్రేటర్ హైదరాబాద్‌లో ఎప్పుడో మూతబడిన కల్లు దుకాణాలను మళ్ళీ ప్రారంభించడాన్ని మహిళాసత్తా తీవ్రంగా ఖండిస్తుంది. వెంటనే జనావాసాల మధ్య ప్రారంభించిన కల్లు దుకాణాలను తొలగించాలని డిమాండ్ చేస్తుంది.

వ్యవసాయం

# గిట్టుబాటు కాదు... లాభసాటి వ్యవసాయం కావాలి

నష్టాల ఊబిలో అప్పుల భారంతో కునారిల్లుతున్న వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నాశనం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రతిఘటించాలని ఈ మహాసభ రైతులకు పిలుపునిస్తున్నది.

### 1. వ్యవసాయానికి అనుసంధానం కాని గ్రామీణ ఉపాధి పథకం

గ్రామీణ ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తానన్న కేంద్ర ప్రభుత్వం ప్రకటన ఇప్పటిదాకా ఆచరణలోకి రాలేదు. ఈ పథకం ద్వారా పేదలకు పనులు కల్పించడాన్ని ఎవరూ కాదనరు. కాని వ్యవసాయ రంగానికి దూరంగా ఇలాంటి ప్రయత్నం చెయ్యడం పూర్తిగా హాస్యాస్పదం అవుతుంది. ఏటా 40,000 వేల కోట్ల రూపాయలతో నిర్వహించే ఈ పథకం కాకుల లెక్కలకి, అవినీతికి నిలయంగా మారడమే కాకుండా వ్యవసాయ సీజనులో కూడా కూలీలు కరువైన పరిస్థితి రావడం వల్ల వ్యవసాయం మరింత భారం అవుతున్నది.

ఈ పథకాన్ని తక్షణమే వ్యవసాయ రంగానికి అనుసంధానం చేసి ఈ రంగంలో మౌలిక వసతుల కల్పనకీ, వ్యవసాయ పనులలో రైతులకు సహాయకారిగా, పేదలకు ఉపాధి నిచ్చేదిగా తక్షణమే మార్చాలని ఈ మహాసభ డిమాండ్ చేస్తున్నది.

### 2. ఆహార భద్రతా పథకాన్ని తిరగరాయాలి

75 శాతం ప్రజలకు ఆహార భద్రత కల్పించడానికి ఉద్దేశించిన జాతీయ ఆహార భద్రతా పథకం రైతు భద్రతను పూర్తిగా విస్మరించడమే కాకుండా ఆహారధాన్యాల స్వేచ్ఛ మార్కెట్‌ను కబళించేదిగా కేంద్ర ప్రభుత్వం రూపొందించింది.

ఆహారధాన్యాల సేకరణ పేరుతో దాదాపు దేశంలో మూడొంతుల వ్యాపారాన్ని ప్రభుత్వం తన చేతుల్లోకి తెచ్చుకుంది. మద్దతు ధర పేరుతో ప్రభుత్వ సబ్సిడీ భారం పరిధిలో ధరలను శాసించే స్థితి తెచ్చింది. ఈ విధానం వల్ల ఆహారధాన్యాల స్వేచ్ఛ మార్కెట్ ఇటు దేశంలోనూ, అటు ఎగుమతులలోనూ అంతరించిపోతుంది.

ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలో బియ్యం సేకరణ చేసి ఆయా జిల్లాలోని పంపిణీ చేయాలి. మన బియ్యం పథకం వైపుగా రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనను మహాసభ స్వాగతిస్తున్నది. ధాన్యం సేకరణనుంచి పంపిణీ వరకు వున్న లీకేజీలను, అవినీతిని అరికట్టాలి. లెవీ ధాన్యం కొలిచిన రైతులకి వెంటనే డబ్బు అందే ఏర్పాటు చేయాలి.

దేశ ప్రజలకు ఆహార భద్రత కల్పించడానికి మరో పక్క రైతుల పంటలకు లాభసాటి ధరలు రావడానికి వీలుగా ఈ పథకాన్ని తిరగరాయాలని డిమాండ్ చేస్తున్నది. ప్రభుత్వమే వ్యాపారిగా, వస్తు సేకరణ పంపిణీ పద్ధతికి స్వస్తి చెప్పి నగదు బదిలీ రూపంలో ఈ పథకాన్ని నిర్వహించాలని, స్వేచ్ఛ మార్కెట్‌కు ద్వారాలు తెరవాలని ఈ మహాసభ డిమాండ్ చేస్తున్నది.

### మార్కెట్‌యార్డులను ప్రజాస్వామీకరణ చేయాలి

మార్కెట్‌యార్డుల్లో రైతులు తగిన ధర లభించక నష్టపోతున్నారు. ఎండనక, వాననక పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి మార్కెట్‌యార్డులకు వచ్చే రైతులకి కనీసం నీడను ఇచ్చే ఏర్పాటు కూడా లేక మంచినీళ్ళు, మరుగుదొడ్ల సౌకర్యం లేక బాధపడుతున్నారు. ఆ మార్కెట్ కమిటీలపై రాష్ట్ర ప్రభుత్వం పెత్తనం చేస్తూ రైతులు అమ్ముకొనే ధాన్యం మీద కమీషన్ వసూలు చేస్తుంది. మార్కెట్ కమిటీల పాలకవర్గాలను రాష్ట్ర ప్రభుత్వమే నియమిస్తూ రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారుస్తున్నది. నిజమైన రైతులకి మార్కెట్ యార్డులు పాలక కమిటీల్లో స్థానం కల్పించాలి. రైతుల నుండే ప్రజాస్వామ్య పద్ధతిలో మార్కెట్‌యార్డు పాలకవర్గాలను ఎన్నుకోవాలి. మార్కెట్‌యార్డు ఆదాయాన్ని పూర్తిగా రైతు శ్రేయస్సుకే వినియోగించాలి. ప్రమాదవశాత్తూ మరణించే రైతులకు పరిహారాన్ని ఇచ్చి వారికి అండగా నిలబడాలి.

# దళితులు ఆత్మగౌరవంతో బతకాలి

**67** సంవత్సరాలుగా ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినా SC, ST, BC, మైనారిటీలలో విద్యా, సామాజిక, ఆర్థిక రంగాలలో సమానత్వాన్ని సాధించలేక పోయాం. పేదల ఆదాయాన్ని, కొనుగోలు శక్తిని పెంచే విధంగా ప్రణాళికలు రూపొందించక పోవడం కేవలం రాయితీలు, తాయిలాలు, సంక్షేమ పథకాలు అమలు చేయడం వలన అభివృద్ధిలో పురోగతి సాధించడం అసాధ్యం అని తేలింది.

### భూమి ఆత్మగౌరవానికి చిహ్నం :

తెలంగాణ రాష్ట్రంలో దళితులకి 3 ఎకరాల భూమి ఇస్తామన్న ప్రభుత్వ హామీని స్వాగతిస్తున్నాం. కాని వ్యవసాయం లాభసాటి కాని ఈ స్థితిలో భూమి ఆత్మగౌరవానికి చిహ్నంగా మాత్రమే మిగలవద్దు. దళితులకి విద్య, ఆరోగ్య వసతులు కల్పించి, వారికి ఉపాధి అవకాశాలను అందుబాటులోకి తెచ్చినప్పుడే దళితులకి నిజమైన సాధికారత సాధ్యమౌతుంది. సా.రా పార్టీలు దళితులను ఓటుబ్యాంకుగా చూసినంతకాలం ఈ పరిస్థితి మారదు. అందుకే లోక్‌సత్తా పార్టీ దళితుల సర్వజన ముఖాభివృద్ధికి ఎస్.సి, ఎస్.టి, బి.సి, మైనారిటీ వర్గాలను ఏకం కావాలని కోరుతుంది.

**డిమాండ్స్ :**

1. రాష్ట్రంలో షెడ్యూల్ కులాలు, తెగాల ప్రజలు జీవన ప్రమాణాలు విద్యా, ఆర్థిక రంగాలలో, మౌలిక వసతుల ఏర్పాటుకు, ఆరోగ్య పరిరక్షణకు, యువతకు ప్రభుత్వ ప్రయివేటు రంగాలలో ఉద్యోగ, ఉపాధి, శిక్షణ అవకాశాలకు SC, ST సబ్‌ప్లానును చిత్తశుద్ధితో అమలు చేయాలని ఈ మహాసభ డిమాండ్ చేస్తున్నది.
2. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య శ్రీ, ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాలను కొనసాగించాలి. పేద ప్రజల ఆర్థిక ప్రగతి సాధించే సంక్షేమ పథకాలు సత్ఫలితాల నిస్తాయి. కాని ఓటు బ్యాంకు రాజకీయాలను, తాత్కాలిక ప్రయోజనాలను, రాజకీయ పార్టీల నాయకుల దోపిడీకి ఉపయోగపడే జనరంజక పథకాలను, ఎన్నికల సమయంలో ఇచ్చే ఉచిత హామీలను పార్టీ వ్యతిరేకిస్తుంది.
3. పేద ప్రజలకు స్వంత ఇంటి నిర్మాణం, ఇళ్ళ స్థలాలు, భూమి పట్టాల పంపిణీకి ప్రభుత్వం చేపట్టి గృహ నిర్మాణ పథకాలు, భూ పంపిణీకి శ్రీ కోనేరు రంగారావు కమిటీ చేసిన సిఫారసులను అమలు చెయ్యాలి. రాష్ట్రంలో SC, ST కమిషన్ వెంటనే ఏర్పాటు చెయ్యాలి. ♦

## సహాయ, పునర్నిర్మాణ కార్యక్రమాలలో ఉదారంగా పాల్గొనాలని లోక్‌సత్తా కార్యకర్తలు, మద్దతుదారులకు జేపీ విజ్ఞప్తి

అక్టోబర్ 12న పెను తుపాను సృష్టించిన విలయానికి దెబ్బతిన్న ప్రాంతాలలో సహాయ, పునరావాస, పునర్నిర్మాణ కార్యక్రమాలకు లోక్‌సత్తా కార్యకర్తలు, మద్దతుదారులు ఉదారంగా డబ్బు, సమయం, వ్యక్తిగత తోడ్పాటును ఇవ్వాలని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు. విపత్తు బాధిత విశాఖ నగరం, ఉత్తరాంధ్ర జిల్లాలు, ఒడిషా ప్రజల కష్టాల్ని మనసారా పంచుకుంటున్నానన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న జేపీ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

ఇలాంటి విపత్తుల సమయంలో ప్రాణనష్ట నివారణను మనం అనుభవంతో నేర్చుకున్నాం కానీ, పునరావాస కార్యక్రమాల్ని మాత్రం ఇంకా రాజకీయం చేస్తూనే ఉన్నామని జేపీ అన్నారు.

“పేద, నిస్సహాయ కుటుంబాలను చేయిజాచి అర్థించే వారుగానే చూస్తున్నాం. ఈ ధోరణి మారాలి. పౌరుల ఆత్మగౌరవం దెబ్బతినకుండా, అవినీతి లేకుండా, పార్టీలకు అతీతంగా సహాయ పునరావాస చర్యలు అందించటం, విపత్తుల నియంత్రణకు దీర్ఘకాలిక ఏర్పాట్లు చేయటం ఇప్పుడు మన లక్ష్యం కావాలి.

“ప్రకృతి ప్రకోపాల్ని సమర్థవంతంగా ఎదుర్కోవటానికి పకడ్బందీ మురుగునీటి వ్యవస్థ, పటిష్ట మౌలిక సదుపాయాలు, మెరుగైన ఇళ్లు, పేదరిక నియంత్రణ అవసరం. పార్టీ రాజకీయాల్ని పక్కనబెట్టి, మన ముందున్న ఈ సవాలును కలసికట్టుగా ఎదుర్కొందాం” అని జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

# తెలంగాణ సమాచారం

భారత దేశ చిత్ర పటంలో 29 రాష్ట్రంగా ఆవిర్భవించిన తెలంగాణ అన్ని రంగాల్లో ప్రత్యేకతను సంతరించుకుంది. మూడున్నర కోట్ల జనాభా, 8778 గ్రామాలు, 438 మండలాలు, 10 జిల్లాలతో ప్రత్యేక తెలంగాణ ఆవిర్భవించింది. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన నేపథ్యంలో పోటీ పరీక్షల పరంగా రాష్ట్ర సమాచారం ఎంతో కీలకమైనది, విలువైనది. విజేత పాఠకుల కోసం తెలంగాణ రాష్ట్ర సమాచారం సంక్షిప్తంగా... (2011 జనాభా లెక్కల ప్రకారం)

## తెలంగాణ రాష్ట్ర సంక్షిప్త సమాచారం

- రాష్ట్ర జనాభా: 3,51,93,978 (2011 జనాభా లెక్కల ప్రకారం)
- దేశ జనాభాలో రాష్ట్ర శాతం: 3.42 శాతం
- దేశ జనాభాలో రాష్ట్ర స్థానం: 12వ స్థానం
- రాష్ట్రంలో పురుషులు: 1,77,04,078
- రాష్ట్ర జనాభాలో పురుషుల శాతం: 50.2 శాతం
- రాష్ట్రంలో స్త్రీల సంఖ్య: 1,74,89,900
- జనాభాలో స్త్రీల శాతం: 49.8 శాతం
- గ్రామీణ జనాభా: 2,15,85,313
- రాష్ట్ర జనాభాలో గ్రామీణ జనాభా శాతం: 61.33 శాతం
- పట్టణ జనాభా: 1,36,08,665
- రాష్ట్ర జనాభాలో పట్టణ జనాభా శాతం: 38.67 శాతం
- అత్యధిక గ్రామీణ జనాభా గల జిల్లా: మహబూబ్‌నగర్ (85.01 శాతం)
- అత్యల్ప గ్రామీణ జనాభా గల జిల్లా: రంగారెడ్డి (29.78 శాతం)
- అత్యధిక పట్టణ జనాభా గల జిల్లా: హైదరాబాద్ (100 శాతం)
- అత్యల్ప పట్టణ జనాభా గల జిల్లా: మహబూబ్‌నగర్ (14.99 శాతం)
- అత్యధిక జనాభా గల జిల్లా: రంగారెడ్డి (2011 జనాభా లెక్కల ప్రకారం)
- అత్యల్ప జనాభా గల జిల్లా: నిజామాబాద్
- 2001–2011 మధ్య రాష్ట్రంలో జనాభా పెరుగుదల శాతం: 13.58 శాతం
- అత్యధిక జనాభా పెరుగుదల గల జిల్లా: రంగారెడ్డి (48.16 శాతం)
- అత్యల్ప జనాభా పెరుగుదల గల జిల్లా: హైదరాబాద్ (2.97 శాతం)
- రాష్ట్ర స్త్రీ–పురుష నిష్పత్తి: 988:1000
- అత్యధిక స్త్రీ–పురుష నిష్పత్తి గల జిల్లా: నిజామాబాద్ (1040)
- అత్యల్ప స్త్రీ–పురుష నిష్పత్తి గల జిల్లా: హైదరాబాద్ (954)
- రాష్ట్రంలో అక్షరాస్యత: 66.46 శాతం
- అత్యధిక అక్షరాస్యత గల జిల్లా: హైదరాబాద్ (83.25 శాతం)
- అత్యల్ప అక్షరాస్యత గల జిల్లా: ఆదిలాబాద్ (61.01 శాతం)
- పురుషుల అక్షరాస్యత: 74.95 శాతం
- మహిళల అక్షరాస్యత: 57.92 శాతం
- గ్రామీణ అక్షరాస్యత: 57.25 శాతం
- పట్టణ అక్షరాస్యత: 81.09 శాతం
- జనసాంద్రత: 307
- అత్యధిక జనసాంద్రత గల జిల్లా: హైదరాబాద్ (18,172 చ.కి.మీ.)
- అత్యల్ప జనసాంద్రత గల జిల్లా: ఆదిలాబాద్ (170 చ.కి.మీ.)
- 0–6 ఏళ్ల రాష్ట్ర బాలల జనాభా: 39,20,418
- రాష్ట్ర జనాభాలో బాలల జనాభా శాతం: 11.13 శాతం
- అత్యధిక బాలల జనాభా గల జిల్లా: రంగారెడ్డి
- అత్యల్ప బాలల జనాభా గల జిల్లా: ఖమ్మం
- రాష్ట్రంలో 0–6 ఏళ్ల బాల బాలికల నిష్పత్తి: 933
- అత్యధిక బాల బాలికల నిష్పత్తి గల జిల్లా: ఖమ్మం (958)
- అత్యల్ప బాల బాలికల నిష్పత్తి గల జిల్లా: హైదరాబాద్ (914)
- రాష్ట్రంలో కుటుంబాల సంఖ్య: 83,57,826 (2011 జనాభా లెక్కల ప్రకారం)
- అత్యధిక కుటుంబాలు గల జిల్లా: రంగారెడ్డి (12,35,341)
- అత్యల్ప కుటుంబాలు గల జిల్లా: నిజామాబాద్ (5,93,234)
- రాష్ట్రంలో మొత్తం కార్మికులు: 1,64,53,000
- రాష్ట్ర జనాభాలో కార్మికుల శాతం: 46.75 శాతం
- రాష్ట్రంలో ప్రధాన కార్మికులు: 1,38,06,211
- రాష్ట్ర జనాభాలో ప్రధాన కార్మికుల శాతం: 39.23 శాతం
- ఉపాంత కార్మికులు: 26,46,789
- మొత్తం జనాభాలో ఉపాంత కార్మికుల శాతం: 7.52 శాతం
- రాష్ట్రంలో వ్యవసాయం చేసేవారి సంఖ్య: 30,16,884
- రాష్ట్ర జనాభాలో వ్యవసాయదారుల శాతం: 21.85 శాతం
- రాష్ట్రంలో వ్యవసాయ కూలీలు: 46,44,422
- మొత్తం జనాభాలో వ్యవసాయ కూలీల శాతం: 33.64 శాతం
- రాష్ట్రంలో గృహ పరిశ్రమల కార్మికులు: 6,36,457
- మొత్తం జనాభాలో గృహ పరిశ్రమల కార్మికుల శాతం: 4.61 శాతం

### అడవులు



- రాష్ట్రంలో అడవుల విస్తీర్ణం: 27,42,856 హెక్టార్లు
- రాష్ట్ర భూ భాగంలో అడవుల విస్తీర్ణ శాతం: 23.88 శాతం
- అత్యధిక అడవులు గల జిల్లా: ఖమ్మం (7,59,438 హెక్టార్లు)
- అత్యల్ప అడవులు గల జిల్లా: రంగారెడ్డి (73,075 హెక్టార్లు)







- తెలంగాణ రాష్ట్ర అవతరణ : 2014 జూన్ 2
- తొలి గవర్నర్ : ఇఎస్ఎల్ నరసింహన్
- రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి: కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు
- రాజధాని : హైదరాబాద్





- తెలంగాణ చిహ్నం: వృత్తాకారం వెలుపల బంగారు వర్ణపు వలయం, అంతర వృత్తంలో చిలుక పచ్చరంగు, వృత్తంలో కాకతీయ కళాతోరణం, దాని దిగువన చార్మినార్, పైన నాలుగు సింహాల స్తూపం, దీని కింద 'సత్యమేవ జయతే' అని దేవనాగరి లిపిలో ఉంటుంది. అంతర వృత్తంలో తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అని ఉంది.
- రాష్ట్ర చిహ్నం రూపశిల్పి: ఏలే లక్ష్మణ్

# తెలంగాణలో గ్రామీణ జనాభా శాతం ఎంత?

## పరిపాలనా విభాగాలు

- జిల్లాలు: 10
- జిల్లా పరిషత్‌లు: 9
- రెవెన్యూ డివిజన్లు: 39
- మండలాలు: 438 (మొత్తం 443 ఉండగా 5 మండలాలను పూర్తిగా ఏపీలో కలిపారు)
- మున్సిపల్ కార్పొరేషన్లు: 6
- మున్సిపాలిటీలు: 38
- నగర పంచాయతీలు: 15
- గ్రామ పంచాయతీలు: 8778
- పట్టణాలు (లక్షకు పైగా జనాభాగల పట్టణాలు): 11

## రాష్ట్ర మంత్రులు

1. మహమూద్ అలీ: రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపులు
2. టీ.రాజయ్య: వైద్యం,ఆరోగ్యం
3. నాయిని నర్సింహారెడ్డి : హోం, జైళ్లు, కార్మిక, ఉపాధి
4. ఈటెల రాజేందర్ : ఆర్థిక, పౌరసరఫరాలు
5. పోచారం శ్రీనివాస్‌రెడ్డి : వ్యవసాయం
6. టీ. హరీష్‌రావు : భారీ నీటిపారుదల, అసెంబ్లీ వ్యవహారాలు, మార్కెటింగ్
7. టీ. పద్మారావు : ఎక్సైజ్
8. పీ మహేందర్‌రెడ్డి : రవాణా
9. కే. తారకరామారావు : ఐటీ, పంచాయతీరాజ్
10. జోగు రామన్న : అటవీ, పర్యావరణం
11. జీ. జగదీశ్వర్‌రెడ్డి : విద్య

## తెలంగాణ సరిహద్దులు



- ఉత్తరం, వాయువ్యం: మహారాష్ట్ర
- దక్షిణం: ఆంధ్రప్రదేశ్
- తూర్పు: ఆంధ్రప్రదేశ్
- పడమర: కర్ణాటక
- ఈశాన్యం: ఛత్తీస్‌గఢ్, ఒడిశా
- రాష్ట్ర వైశాల్యం: 1,14,840 చ.కి.మీ.
- భారతదేశంలో తెలంగాణ వైశాల్య శాతం: 3.49 శాతం
- దేశ వైశాల్యంలో తెలంగాణ స్థానం: 12వ స్థానం
- తెలంగాణలో జిల్లాలు: 10
- అతిపెద్ద జిల్లా: మహబూబ్‌నగర్
- చిన్న జిల్లా: హైదరాబాద్

### ప్రజాప్రతినిధులు

- లోక్‌సభ సభ్యుల సంఖ్య: 17
- రాజ్యసభ సభ్యులు: 7
- ఎమ్మెల్యేలు: 119
- ఎమ్మెల్సీలు : 40
- జెడ్పీటీసీలు: 438
- ఎంపీటీసీలు: 6497
- అసెంబ్లీ స్పీకర్ : సిరికొండ మధుసుదనాచారి
- డిప్యూటీ స్పీకర్: పద్మాదేవేందర్‌రెడ్డి
- శాసనమండలి చైర్మన్ : స్వామిగౌడ్
- శాసన మండలి డిప్యూటీ చైర్మన్: నేతి విద్యాసాగర్
- అసెంబ్లీలో ప్రతిపక్షనేత: కుందూరు జానారెడ్డి
- మండలిలో ప్రతిపక్షనేత : డి. శ్రీనివాస్
- రాష్ట్ర చీఫ్ సెక్రటరీ: రాజీవ్‌శర్మ
- రాష్ట్ర డీజీపీ : అనురాగ్‌శర్మ
- రాష్ట్ర అధికార భాష: తెలుగు
- రాష్ట్రంలో మాట్లాడే ప్రధాన భాషలు: తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్

### వ్యవసాయం

- సాగుకు యోగ్యమైన భూమి: 56.90 హెక్టార్లు
- సాగు వసతి ఉన్న భూమి: 29,98,798 హెక్టార్లు
- కాలువల కింద సాగువసతి గల భూమి: 5,03,887 హెక్టార్లు
- చెరువుల కింద సాగువసతి గల భూమి: 3,05,254 హెక్టార్లు
- భూగర్భ జలాల కింద సాగువసతి గల భూమి: 21,40,950 హెక్టార్లు
- అత్యధిక సాగువసతి ఉన్న భూములు గల జిల్లా: కరీంనగర్ (3,34,928 హెక్టార్లు)
- అత్యల్ప సాగువసతి గల భూములున్న జిల్లా: రంగారెడ్డి (76,514 హెక్టార్లు)
- చెరువుల కింద అత్యధికంగా సాగుచేస్తున్న జిల్లా: వరంగల్
- చెరువుల కింద అత్యల్పంగా సాగుచేస్తున్న జిల్లా: రంగారెడ్డి
- రాష్ట్రంలో మొత్తం చెరువులు: 36,304
- అత్యధికంగా చెరువులున్న జిల్లా: మహబూబ్‌నగర్
- అత్యల్పంగా చెరువులున్న జిల్లా: ఆదిలాబాద్



అనంతారపు కృష్ణయ్య
స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్)
జి. ప. ఉ. పాఠశాల రామాపురం,
నడిగూడెం(మం) నల్లగొండ.
సెల్:9948750605

### రహదారులు



- రాష్ట్రంలో జాతీయ రహదారులు: 1595 కి.మీ.
- రాష్ట్ర రహదారులు: 3295 కి.మీ.
- ప్రధాన జిల్లా రహదారులు: 12,839 కి.మీ.
- గ్రామీణ రోడ్లు: 36,304 కి.మీ.
- రాష్ట్రం గుండా పోయే జాతీయ రహదారులు: 7, 65(9), 221, 163

### జిల్లాల వారీగా జనాభా వివరాలు (2011 జనాభా లెక్కల ప్రకారం)

| జిల్లా | వైశాల్యం (చ.కి.మీ) | జనాభా (2001-11) | జనాభా పెరుగుదల శాతం | స్త్రీ-పురుష నిష్పత్తి | అక్షరాస్యత శాతం | జనసాంద్రత | బాల బాలికలు | బాలబాలికల నిష్పత్తి |
|---|---|---|---|---|---|---|---|---|
| ఆదిలాబాద్ | 16,105 | 27,41,239 | 10.18 | 1001 | 61.01 | 170 | 3,09,992 | 934 |
| హైదరాబాద్ | 217 | 39,43,323 | 2.97 | 954 | 83.25 | 18,172 | 4,69,126 | 914 |
| కరీంనగర్ | 11,823 | 37,76,269 | 8.15 | 1008 | 64.15 | 319 | 3,36,053 | 935 |
| ఖమ్మం | 16,029 | 27,97,370 | 8.47 | 1011 | 64.81 | 175 | 2,87,922 | 958 |
| మహబూబ్ నగర్ | 18,432 | 40,53,028 | 15.47 | 977 | 55.04 | 220 | 5,27,230 | 925 |
| మెదక్ | 9,699 | 30,33,288 | 13.60 | 992 | 61.42 | 313 | 3,67,603 | 952 |
| నల్లగొండ | 14,240 | 34,88,809 | 7.41 | 983 | 64.20 | 245 | 3,71,735 | 923 |
| నిజామాబాద్ | 7,956 | 25,51,335 | 8.77 | 1040 | 61.25 | 321 | 2,82,417 | 948 |
| రంగారెడ్డి | 7,493 | 52,96,741 | 48.16 | 961 | 75.87 | 707 | 6,33,172 | 933 |
| వరంగల్ | 12,866 | 35,12,576 | 8.21 | 997 | 65.11 | 273 | 3,41,168 | 923 |
| మొత్తం | 1,14,840 | 3,51,93,978 | 13.58 | 988 | 64.46 | 307 | 39,20,418 | 933 |

# సాయుధ

బండారు రామ్మోహన్ రావు

సెప్టెంబర్ 6 (శనివారం) లోక్‌సత్తా తెలంగాణ రాష్ట్ర కార్యాలయాన్ని డా|| జయప్రకాష్ నారాయణ్ గారు ప్రారంభించారు. ప్రారంభసభలో సభాధ్యక్ష స్థానంలో వున్న నేను 'భీష్మ ప్రతిజ్ఞ' చేసాను. "అమ్మకి ఆదివారం వుండాలి కానీ రాజకీయ పార్టీ కార్యాలయాలకు ఉండకూడదన్నాను". పార్టీ అనే దుకాణం తెరిచాక ఎన్నికల్లో పోటీ చేయడం ఎంత సహజమో పార్టీ కార్యాలయాల్ని కూడా సెలవుదినాలు ప్రజలకు అందుబాటులోకి తేవడం అంతే అవసరం అన్నాను. ఆ ప్రకారంగా వచ్చే ఆదివారం నుండి లోక్‌సత్తా తెలంగాణ కార్యాలయం తెరిచేవుంటుందని ప్రకటించాను. ఆ ప్రతిజ్ఞకనుగుణంగా వచ్చే ఆదివారం దాకా టైమున్నా తెల్లవారే ఆదివారం కావడం వల్ల కార్యాలయ కార్యదర్శి గోవిందరావు ఒక ఉచిత సలహా ఇచ్చాడు. ఈ పాటి పనికి వచ్చే ఆదివారం దాకా ఎందుకు సార్.. రేపటి నుండే మొదలుపెడదాం అన్నాను. అట్లా మొదటి ఆదివారం నుండే ఆఫీసు తెరవడం ఆరంభించాము. ఆఫీసు దినాల్లో రాని రెస్పాన్స్ ఆదివారం వచ్చింది. మేము ఊహించినదానికన్నా ఎక్కువమంది కొత్త ఆఫీసును సందర్శించారు. మధ్యాహ్నం భోంచేసి ఎవరు వస్తారులే అనుకుంటుండగా ఒక 70 ఏళ్ళ వృద్ధుడు చేతికర్రను ఆసరా చేసుకుని రెండవ అంతస్తులో వున్న ఆఫీసుకి మెల్లగా మెట్లు ఎక్కుతూ వచ్చాడు. ఆ వెనకే ఒక అమ్మాయి ఆయనకు ఆసరాగా నిలబడి పైదాకా తీసుకొచ్చింది. వారిద్దరినీ చూస్తునే నా రూంలోకి రమ్మన్నాను. ఆ వృద్ధుడు మొదలుపెట్టాడు. ఆయనకు లోక్‌సత్తా పార్టీ అంటే ఎనలేని అభిమానం. జేపీగారిని స్వయంగా చూడలేదు. జేపీ గారి ఆశయాలు ఆయనను ఉత్తేజపరిచాయి. ఆయన వృత్తి జీవితంలో అనేక ఒడుదుడుకులు చవి చూసినా, ప్రభుత్వ లెక్చరర్‌గా పనిచేస్తూ లోక్‌సత్తా ఆశయాల మేరకు అన్యాయాలను ఎదిరిస్తుంటే రిటైర్‌మెంట్‌కు 16 నెలలు వుందనగా వరంగల్ నుంచి అదిలాబాద్ జిల్లా మారుమూల సిర్పూర్‌కు బదిలీచేశారు. ఇలా బదిలీచేయడం అన్యాయమని కోర్టుకు వెళితే న్యాయం జరుగుతుందని చాలా మంది ఆయనకు సలహా ఇచ్చారు. అయినా ఆయన వినలేదు. ఆ బదిలీని ఆయన ఒక అవకాశంగా తీసుకున్నాడు. మంచి బోధించడానికి ఏ ఊరు అయితేనేం అనుకున్నాడు. సిర్పూర్‌లో తన రిటైర్‌మెంటు దాకా పనిచేసి అక్కడే విశ్రాంత అధ్యాపకుడయ్యారు. "నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది" అన్న సామెతను అక్షరాల నిజం చేశాడు. ఆయన పేరు సత్యనారాయణ. లోక్‌సత్తా సత్యనారాయణగా ఆ ఊళ్ళో సుపరిచితుడు అయ్యారు. ఉద్యోగానికే రిటైర్‌మెంటు ఉంటుంది కాని జీవితానికి కాదు కదా అంటూ లోక్‌సత్తా ఆశయాలను ప్రజలకు వివరించడానికి పూనుకున్నాడు. ఇంతలో ఆయన ఆరోగ్యం చెడిపోయింది. అనుకోకుండా బ్రెయిన్ మలేరియా వచ్చి వారం రోజులు కోమాలోకి వెళ్ళిపోయారు. రోజూ కనబడే సత్యనారాయణ కనపడ్డం లేదని ఆయన మిత్రులు వాకబు చేస్తే ఏ సంసార జంజాటం లేని ఆయన రూంలో ఒంటరిగా కోమాలోకి వెళ్ళిపోయి కన్పించారు. మిత్రులు ఆస్పత్రిలో జాయిన్ చేశారు. ఎవరికి తెలియజేయాలో కనీసం అడ్రసు, ఫోన్ నంబరు కూడా ఆయన వద్ద లేదు. సెల్‌ఫోన్ వాడని ఛాందసవాది, ఆయన ఫోను చేస్తేనే కుటుంబసభ్యులకు తెలిసేది. ఆయన కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకుని వారందరూ వచ్చేసరికి 10 రోజులు దాటింది. మొత్తానికి చావు తప్పి కన్ను లొట్టబోయినట్లు 6, 7 నెలల తరువాత మళ్ళీ మునుపటి సత్యనారాయణగా జీవనం మొదలుపెట్టారు. అక్కడి నుండి హైదరాబాద్ దగ్గర్లోని భువనగిరికి మకాం మార్చాడు. భువనగిరిలో ఒక వృద్ధాశ్రమానికి తన రిటైర్‌మెంటు డబ్బుల్లోంచి కొంత మొత్తాన్ని వెచ్చించి ఆశ్రయం కోరారు.

"తిరిగే కాలు తిట్టేనోరు ఊరుకోదు" అంటారు. అలాగే భువనగిరి కొత్తఊరే అయినా అక్కడ గతంలోనే వున్న లోక్‌సత్తా మిత్రుడు జయప్రకాష్ రావు, అంజయ్యలను పరిచయం చేసుకున్నారు. వాళ్ళతో కలిసి మళ్ళీ కార్యక్రమాలు మొదలుపెట్టాడు. లోక్‌సత్తా పార్టీ గనుక మా వృద్ధాశ్రమానికి రాజకీయాలు అంటుకుంటాయని ఆ కార్యకలాపాలకు స్వస్తి చెప్పాలని వృద్ధాశ్రయ యాజమాన్యం సత్యనారాయణను హెచ్చరించింది. ఆ హెచ్చరికను ఖతరు చెయ్యలేదాయన. అవసరమయితే వృద్ధాశ్రమాన్ని మారుస్తాను కానీ తన ఆశయాలను మార్చుకోను అన్నారు. ఆ వయసులో

భువనగిరిలోనే ఒక రూం తీసుకుని పని మొదలుపెట్టాడు. లోక్‌సత్తాలో ఆయనకి జేపీ గారు తప్ప ఇంకెవరూ తెలియదు. జేపీకి ఏకలవ్య శిష్యుడాయన. హైదరాబాద్‌లో లోక్‌సత్తా తెలంగాణ కార్యాలయం ప్రారంభమైందని తెలుసుకున్న తక్షణమే తెల్లవారే మన ఆఫీసుకు వచ్చాడు. తాను లోక్‌సత్తా కార్యక్రమాలకు ఎలా ఉపయోగపడతానో అలా ఉపయోగించుకోమన్నారు. ఆయన వెంటే వచ్చిన అమ్మాయి స్వయానా ఆయన కూతురే. ఇక ఆమె చెప్పడం మొదలుపెట్టింది. నాన్నగారు జేపీ గారి వ్యాసాల్నీ, ఆయన పత్రికాప్రకటనలను క్రమం తప్పకుండా చదువుతారని, వాటి అమలుకి పూనుకుంటారని ఆ స్ఫూర్తితో కుటుంబాన్ని తన ఆరోగ్యాన్ని కూడా లెక్కచెయ్యరని చెప్పింది. మరో ఆలోచన లేకుండా వృద్ధాశ్రమంలో పడుంటే ఆయన ఆరోగ్యం మళ్ళీ దెబ్బ తింటుందని ఆయన అనారోగ్యాన్ని నయం చేయడానికి "అసలైన మందు లోక్‌సత్తా కార్యక్రమాలేనని" ఆవిడ చెప్పింది. ఆయన మానసిక ఆరోగ్యం బాగుండాలంటే లోక్‌సత్తా కార్యకలాపాల్లో పాల్గొనేటట్లు అవకాశాలు కల్పించాలని ఆమె ప్రాధేయపడింది. ఆమె పేరు 'సాయుధ' హైదరాబాద్‌లోని ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో మంచి ఉద్యోగం చేస్తుంది. రిటైర్‌మెంటు తరువాత ఈ గొడవంతా ఎందుకు పెన్షన్ వస్తుందికదా హాయిగా తన వద్ద విశ్రాంతి తీసుకోవాలన్న కూతురి కోరికను సున్నితంగా తిరస్కరించిన సత్యనారాయణ సత్తువ ఉన్నంతవరకు ప్రజాచైతన్యమే పరమావధిగా పనిచేస్తానని అన్నాడు అంది. మొండిఘటం ఉన్న ఒక్క కూతురి మాటనే ఎలాగు వినేటట్లు లేదని లోక్‌సత్తా ఆఫీసుకి తీసుకువచ్చింది. తల్లి చనిపోయినా గుండెల్లో పెట్టుకుని పెంచిన నాన్న ఆరోగ్యం బాగుండాలంటే లోక్‌సత్తాలో పనిచేయించాలని ఆమె కోరింది.

అమ్మా సాయుధా... మీ నాన్న అనే రూపంలో ఒక ఆయుధాన్నే మాకు అందించావు. ఆ ఆయుధాన్ని మేము తప్పనిసరిగా సమాజసేవకు ఉపయోగిస్తాం అన్నాను. చివరిగా ఒక మాట సార్ అన్నాడు సత్యనారాయణ. మీరు అవకాశం ఇస్తే ఈ వయసులో కూడా "మీతో పోటీపడి పనిచేస్తాను" అన్నాడు. అందుకే కొంతమంది యువకులు పుట్టుకతో వృద్ధులయితే మరికొంత మంది వృద్ధులు వయసులో వృద్ధులయినా మానసికంగా నవజీవన నిర్మాతలు అన్న మహాకవి శ్రీశ్రీ కవితకు ఇంతకన్నా ఉదాహరణ ఏం కావాలి. ■

# తంబళ్ళపల్లిలో గాంధీ జయంతి



స్థానిక లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శరవణ్‌కుమార్ పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. గాంధీ జయంతి రోజున తమపార్టీ ఆవిర్భవించిందని, బాపూజీ ఆశయాల సాధన కోసం కార్యకర్తలు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు ఫణీంద్రశర్మ, కె. సూర్యనారాయణ, మహిళా నాయకురాలు నిర్మల, గడ్డం వెంకట్రమణారెడ్డిలతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

**ములకల చెరువు :** గాంధీ మహాత్ముడు బోధించిన శాంతి, అహింసా మార్గం మానవాళికి శిరోధార్యమని ఎంపీపీ ఆశాబీ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గాంధీ మహాత్ముని జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అశాంతితో అల్లాడుతున్న మానవలందరికీ మహాత్ముని అహింసా మార్గం ఉపశమనం కలిగిస్తుందని ఎంపీడీవో నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఆనందకుమార్, మండల ప్రత్యేక ఆహ్వానితులు కాలేషా, కోఆప్షన్ సభ్యులు మౌలా, ఆర్ఐలు నారాయణరెడ్డి, శ్రీనివాసరావు, ఏపీఎం నీరజ, ఏపీవో చిన్నరెడ్డెమ్మ, వ్యవసాయ శాఖాధికారిణి నవత, పశువైద్యాధికారిణి డాక్టర్ వినీత, కార్యదర్శులు పాల్గొన్నారు.

# వలసలను తట్టుకునేందుకు శాటిలైట్ సిటీలు

## మెట్రోపాలిస్ డైరెక్టర్ క్రిస్ జాన్సన్

నగరాల మధ్య సమస్యలు, సానుకూలతలపై చర్చించి ఒకరికొకరు తోడ్పాటు అందించుకునేందుకు మెట్రోపాలిస్ సదస్సు దోహదం చేస్తుందని 2008లో సిడ్నీ(ఆస్ట్రేలియా)లో నిర్వహించిన 9వ మెట్రోపాలిస్ సదస్సు డైరెక్టర్ క్రిస్ జాన్సన్ చెప్పారు. వలసలను తట్టుకునేందుకు శాటిలైట్ సిటీలు ఉపకరిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. సిడ్నీ అర్బన్ టాస్క్‌ఫోర్స్ సీఈవో హోదాలో ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న మెటోపాలిస్ సదస్సులో క్రిస్ జాన్సన్ పాల్గొంటున్నారు.

**మీ నగరంలో జరిగిన సదస్సులో తీసుకున్న నిర్ణయాలు, అమలు తీరుతెన్నులు ఎలా ఉన్నాయి?**

భారత్ నుంచి పలు నగరాల ప్రతినిధులు సిడ్నీ వచ్చారు. ముంబయి, ఢిల్లీ, కోల్‌కతా మేయర్లు వచ్చారు. భారత్–ఆస్ట్రేలియా మధ్య సంబంధాలు మెరుగుపర్చడం, అవసరమైన అంశాల్లో సాంకేతికతను ఇచ్చిపుచ్చుకోవడం, విద్య, సాంస్కృతిక రంగాల్లో పరస్పర మార్పిడి వంటి అంశాల్లో అప్పటికీ ఇప్పటికీ ఎంతో పురోగతి ఏర్పడింది. భారత్‌లో క్రికెట్ మ్యాచ్‌లు ఈ కోవకే చెందుతాయి. ఇరుదేశాల్లో న్యాయవ్యవస్థలు ఒకే విధంగా ఉన్నాయి. ఇక్కడి నగరాల్లో నిర్మిస్తున్న మెట్రో రైలు వంటి ప్రజా రవాణా వ్యవస్థ స్ఫూర్తితో మా దగ్గర ఇటీవలే మెట్రోరైలును మొదలుపెట్టాం.

**సదస్సులో ప్రధానంగా మీరు ఏయే అంశాలపై మాట్లాడారు.. మాట్లాడబోతున్నారు?**

అర్బన్ టాస్క్‌ఫోర్స్‌లో భాగంగా మూడు అంశాలపై నా ప్రసంగాలు ఉన్నాయి. గృహ నిర్మాణం, కార్యాలయ భవనాలు, పరిశ్రమలపై ఒక్కో రోజు మాట్లాడుతున్నాను. మొదటిరోజు ఆవాసం(హ్యాబిటేట్)పై చర్చలో పాల్గొన్నాను. మా దగ్గర ఎక్కడా మురికివాడలు కన్పించవు. అల్పాదాయ వర్గాలకు ప్రభుత్వం గృహాలను నిర్మించి ఇస్తుంది. సాధారణంగా ఇవి 10 నుంచి 20 అంతస్తుల టవర్లుగా ఉంటాయి. మౌలిక వసతులు ఉన్న చోటనే వీటిని నిర్మిస్తుంటారు. నీటి వసతి, ప్రజా రవాణా అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ఈ తరహా నిర్మాణాలు చేపడుతుంటారు. నగరాన్ని పొడుగ్గా విస్తరించుకుంటే వెళితే గంటల సమయం రవాణాకే సరిపోతుంది. అందుకే నిలువుగా ఎదిగేలా గృహ నిర్మాణం ఉంటుంది.

**పరిశ్రమల పరంగా అక్కడ ఎలాంటి విధానాలు అమలు చేస్తున్నారు?**

అనుమతుల విషయంలో త్వరితగతిన నిర్ణయాలు ఉంటాయి. ప్రోత్సహించే విధంగా విధానాలు ఉన్నాయి. గృహ నిర్మాణమే తీసుకుంటే సాధ్యమైనంతగా ప్రైవేటు ఆపరేటర్లు ఎక్కువ ఇళ్లను నిర్మించేలా ప్రోత్సహిస్తుంటారు. ఫలితంగా ఎన్నో రంగాలకు ఉపాధికి అవకాశం ఏర్పడుతుంది. హైదరాబాద్‌లో అనుమతుల విషయంలో రెండేళ్లు పడుతుందని విన్నాను. ఇది అంత మంచిది కాదు.

శాటిలైట్ సిటీల నిర్మాణంపై ప్రస్తుతం విస్తృతంగా చర్చ నడుస్తోంది. అవి ఎలా ఉంటే ప్రజలకు మెరుగ్గా ఉంటుంది..

వలసలను తట్టుకునేందుకు శాటిలైట్ సిటీలు ఉపకరిస్తాయి. సిడ్నీ చుట్టూ నాలుగు శాటిలైట్ సిటీలను నిర్మిస్తున్నాం. ప్రధాన నగరానికి సమాన దూరంలో ఒక కేంద్రంగా నగరాన్ని అభివృద్ధి చేసి మెరుగైన రవాణాకు చర్యలు చేపడుతున్నారు. సాంకేతికంగా అన్ని హంగులు సమకూరుస్తారు. ప్రస్తుతం సిడ్నీలో 40 లక్షల జనాభా ఉంది. రాబోయే రోజుల్లో భారీగా పెరిగే అవకాశం ఉండటంతో ఈ తరహా ముందస్తు వ్యూహాలతో వెళుతున్నాం.

**ప్రజా రవాణా వ్యవస్థ ఎలా ఉంది.. మెరుగ్గా ఏం చేయబోతున్నారు?**

ఈ విషయంలో ఇప్పటి వరకు మాది కొంత వెనుకబాటే. భారత్‌లోని వేర్వేరు నగరాల్లో మెట్రో రైలును నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లోనూ మెట్రో నిర్మాణాన్ని చూశాను. మా నుంచి మీరు తెలుసుకోవడమే కాదు మెట్రో విషయంలో మీ నుంచి మేం నేర్చుకుంటున్నాం. "ట్రాన్సిట్ ఓరియంటెడ్ డెవలప్‌మెంట్" అనేది చాలా మంచి ఆలోచన. మెట్రో కారిడార్ వెంట కార్యాలయాలు ఉండటం వల్ల ఉద్యోగులకు సౌకర్యవంతమైన రవాణా అందుబాటులో ఉంటుంది. ■

# అందరి కోసం నగరాలు

**నినదించిన మెట్రోపాలిస్ కాంగ్రెస్**

నగరాలు, పట్టణాల్లో మెరుగైన జీవనమే లక్ష్యంగా ప్రపంచ దేశాల మేధోమథనం ఆరంభమైంది. "అందరి కోసం నగరాలు" నినాదంతో మెట్రోపాలిస్ ప్రపంచ కాంగ్రెస్ మొదలైంది. ఈ సదస్సు సన్నాహక సమావేశం సోమవారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో జరిగింది. మెట్రోపాలిస్‌లో యువత, అందరికీ నివాసం, హైదరాబాద్ హ్యాకథాన్, నగరాల్లో జీవనంపై దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన బాలలు ఈ సన్నాహక సమావేశంలో ప్రసంగించారు. నగరాల్లో ప్రధాన సమస్యలు ముఖ్యంగా మురికివాడల్లో ప్రజల ఇబ్బందులపై బాలలు రాజ్‌కుమార్(హైదరాబాద్) మాలతియాదవ్, జాస్మిన్ నిస్సా, రూపక్‌గౌడలు సమావేశంలో మాట్లాడారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా.. ఆసియా ఖండంలోనే తొలిసారిగా జరుగుతున్న 11వ మెట్రోపాలిస్ ప్రపంచ కాంగ్రెస్‌కు హైదరాబాద్ నగరం అతిథ్యం ఇస్తుండడం విశేషం.

తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మెట్రోపాలిస్ కాంగ్రెస్‌ను అధికారికంగా ప్రారంభించారు. "అందరికోసం నగరాలు –ప్రజల కోసం, ప్రజల చేత...ప్రజల నగరాలు" అనే అంశంపై మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం కీలకోపన్యాసాన్ని చేసారు. గవర్నర్ నరసింహన్, కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఎం.వెంకయ్యానాయుడు, ప్రముఖ పర్యావరణ వేత్త రాజేంద్రపచోరి, మెట్రోపాలిస్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీన్‌పాల్ హచోన్, ప్రముఖ శాస్త్రవేత్త వి.కె.సారస్వత్, బార్సిలోనా, ఇస్తాంబుల్ మేయర్లు సహా సుమారు 400 మంది వివిధ దేశాల ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారు. రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ తొమ్మిదో తేదీన సదస్సును ఉద్దేశించి ప్రసంగించారు.

**యువతే కీలకం :** నగరాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి హ్యాకథాన్ పోటీలు నిర్వహించడం హర్షణీయమని మెక్సికోకు చెందిన ఆర్కిటెక్ట్ ఆల్ఫాన్సో గోవెలా అన్నారు. మెట్రోపాలిస్ కాంగ్రెస్ సన్నాహక సమావేశంపై సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నగరాల నిర్మాణంలో యువత పాత్ర ఎంతో కీలకమైందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారం చూపాలనే పట్టుదల యువతలో బలంగా ఉందన్నారు. హైదరాబాద్‌లోని యువతలో అనేక ఆలోచనలు ఉన్నాయని పేర్కొన్నారు. హ్యాకథాన్‌లో వచ్చిన ఆలోచనల్ని ప్రపంచంలోని అన్ని నగరాల్లోనూ ఉపయోగించుకోవచ్చన్నారు. హైదరాబాద్ నగరంలో ఆదివారం పర్యటించి చార్మినార్ ప్రాంతాన్ని సందర్శించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నగరంపై సదభిప్రాయం కలిగినట్లు చెప్పారు. ఫ్రాన్స్ నగర ప్లానర్ అలియన్ రెంక్ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యం ఉంటేనే భవిష్యత్తులో నగరాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం, పౌర సమాజం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నగరాల




## సవాళ్లను అధిగమిద్దాం

పట్టణాలు, నగరాల దిశగా ప్రపంచం వేగంగా పరుగులు తీస్తున్న 21 శతాబ్దంలో... పారిశుద్ధ్యం, కాలుష్యం, రవాణా, ప్రజా భద్రత, పౌర సదుపాయాలు వంటి కీలకాంశాల్లో ఎదురవుతున్న సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవాలని భారత రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ పిలుపునిచ్చారు. మెట్రోపాలిస్ ప్రపంచ కాంగ్రెస్ నేపథ్యంలో పట్టణాలు, నగరాల సమస్యలపై దేశ, విదేశాలకు చెందిన ప్రతినిధులు చర్చించడం మంచి పరిణామమని రాష్ట్రపతి అన్నారు. "అందరి కోసం నగరాలు" లక్ష్యసాధనకు అవసరమైన పట్టణ ప్రణాళికల రూపకల్పన, మెరుగైన పరిపాలన విధానాలకు ఈ సదస్సు ఎంతో ఉపయోగపడుతుందని ఆకాంక్షించారు.

నిర్మాణంలో యువత భాగస్వామ్యం అవసరమన్నారు.

శాన్‌ఫ్రాన్సిస్కోకు చెందిన నిపుణుడు టిమ్ క్యాంప్‌బెల్ మాట్లాడుతూ అర్బన్ హ్యాకథాన్ ఎంతో అద్భుతంగా ఉందని చెప్పారు. యువతలో మంచి ఉత్సాహం కనిపిస్తోందని, ప్రధాన సమస్యలకు పరిష్కార మార్గాలను చూపించేందుకు చేపట్టిన హ్యాకథాన్ మంచి ఫలితాలు ఇస్తోందన్నారు. స్మార్ట్ నగరాలు అంటే కేవలం వీధిదీపాలు, సాంకేతికంగా వినియోగించే అంశాలు మాత్రమే కాదని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలతోపాటు నగర లీడర్‌షిప్ కూడా ఎంతో అవసరమని స్పష్టం చేశారు. ఇతర నగరాల్లో చేపడుతున్న పనులను నేర్చుకోవడం ద్వారా ఇక్కడ మనం కూడా అభివృద్ధిబాట పట్టవచ్చని తాను రచించిన పుస్తకంలో పేర్కొన్నట్లు తెలిపారు. హైదరాబాద్ కూడా అభివృద్ధి చెందుతూ వస్తోందన్నారు. నగరంలోని యువతలో మంచి నైపుణ్యం ఉందన్నారు. కొన్ని అంశాలను పరిష్కరిస్తే హైదరాబాద్ భవిష్యత్తు ఎంతో ఉజ్వలంగా ఉంటుందని చెప్పారు. బ్రిటన్‌కు చెందిన నగర అంశాల నిపుణుడు ఫిలిప్ రెస్ట్ మాట్లాడుతూ కొత్త ఆలోచనలకు ఆచరణ రూపం ఇచ్చే విధంగా హ్యాకథాన్‌ను నిర్వహిస్తున్నారని చెప్పారు. అంతర్జాతీయంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ఇదొక చక్కని అవకాశమని అభిప్రాయపడ్డారు. ఇటువంటి ప్రాజెక్టులు ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు.

ఐఎస్‌బీ ప్రతినిధి సుబ్రహ్మణ్యశర్మ మాట్లాడుతూ హ్యాకథాన్ కోసం మొత్తం 370 మంది బృందాలు ముందుగా రిజిస్టర్ చేసుకున్నాయని చెప్పారు. గత నెలలో రెండు రోజులపాటు ముందస్తు హ్యాకథాన్ నిర్వహించినప్పుడు 80 బృందాలు పాల్గొన్నాయని, వీరికి మైక్రోసాఫ్ట్ సాంకేతిక సహకారం అందించిందని తెలిపారు.

**వివిధ అంశాలపై చర్చలు:** పట్టణ సమానత్వం, పరిపాలనలో ప్రజల భాగస్వామ్యం, స్థానికంగా ఆర్థిక వనరులు సమకూర్చుకోవడం, నగరాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు, వాటిని వివిధ దేశాలు, ప్రాంతాల్లో అధిగమిస్తున్న తీరుపై సదస్సులో చర్చిస్తారు. మెట్రోపొలిస్ కాంగ్రెస్‌లో మేయర్లు, రాజకీయ నాయకులు, ప్రభుత్వ విధాన రూపకర్తలు, నగరాల అంశాల్లో నిష్ణాతులు, పట్టణ రూపకర్తలు, పట్టణ నిర్వహణ నిపుణులు, అంతర్జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థలు, విద్యావేత్తలు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల, ఇతర పట్టణ భాగస్వామ్యులు పాల్గొంటారు. ■

## హైదరాబాద్‌ను మేటి నగరంగా తీర్చిదిద్దుతాం: కేసీఆర్

ప్రపంచంలోనే మేటి మహానగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఇందుకు సమగ్ర ప్రణాళిక రూపొందిస్తామని ప్రకటించారు. రాష్ట్రంలోని ద్వితీయ శ్రేణి నగరాలనూ అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో అట్టహాసంగా ప్రారంభమైన మెట్రోపొలిస్ ప్రపంచ కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగించారు. గవర్నర్ ఈ.ఎస్.ఎల్.నరసింహన్ 11వ మెట్రోపొలిస్ ప్రపంచ కాంగ్రెస్ ప్రారంభమైనట్లు అధికారికంగా ప్రకటించారు. కార్యక్రమంలో కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఎం.వెంకయ్యనాయుడు, తెలంగాణ శాసనసభ స్పీకర్ ఎస్.మధుసూదనాచారి, మెట్రోపొలిస్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ జీన్ పాల్ హచోన్, హైదరాబాద్ మేయర్ మాజీద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ ప్రసంగిస్తూ.. తెలంగాణలో పట్టణ, నగర జనాభా 40 శాతం దాటిందని ఈ నేపథ్యంలో సమ్మిళిత అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. పట్టణీకరణ నేపథ్యంలో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి పూర్తి మద్దతిస్తామని కేంద్రప్రభుత్వం ప్రకటించినందుకు ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్ విశ్వవ్యాప్త సంస్కృతిని సొంతం చేసుకొన్నదని, ఎంతో వైవిధ్యం ఉన్నదని చెప్పారు.



# నగరాలకు ప్రణాళిక లోపమే పెనుశాపం

- బి.ఎన్.జ్యోతిప్రసాద్

ప్రపంచం పట్టణీకరణ వైపు వేగంగా పరుగులు తీస్తోంది. పట్టణాలే ప్రగతికి పట్టుగొమ్మలన్న అభిప్రాయం పోనుపోనూ బలపడుతోంది. భారతదేశంలో సుమారు మూడువంతుల మంది పట్టణాలు, నగరాల్లోనే జీవిస్తున్నారు. 2031నాటికి అది దాదాపు సగానికి చేరుకుంటుందని అంచనా. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో నగరాలు, పట్టణాల వాటా ప్రస్తుతం 60శాతం. అది 75శాతానికి ఎగబాకుతుందంటున్నారు. పెరుగుతున్న నగర, పట్టణ జనాభా పలు సవాళ్లు రువ్వుతోంది. పట్టణాలు, నగరాలు విస్తరిస్తున్నప్పటికీ అక్కడి ప్రజల జీవన స్థితిగతుల్లో మార్పులు రావడంలేదు. అరకొర సౌకర్యాలతో కనీస వసతులకు నోచుకోకుండా కోట్లమంది దుర్భర జీవనం సాగిస్తున్నారు. జీవన ప్రమాణాలు మెరుగుపడే బదులు, సమస్యలు చుట్టుముడుతున్నాయి. ఆసియా ఖండంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లో జరుగుతున్న మెట్రోపొలిస్ సదస్సు నగరాల ప్రపంచ గమనాన్ని మన ముందుంచుతోంది. సదస్సు నినాదమైన "అందరికోసం నగరాలు" ఆచరణసాధ్యం కావాలంటే మన ప్రయాణం ఎంతో దూరం సాగాల్సి ఉంది.

## సమస్యలు తీవ్రతరం

దేశంలో ప్రస్తుతం 37.7కోట్లమంది నగరాలు, పట్టణాల్లో నివసిస్తున్నారు. దేశంలో పది లక్షల జనాభా దాటిన మెట్రో నగరాల సంఖ్య 50. అవి 2031నాటికి 87కు చేరుకుంటాయి. మరోవైపు స్మార్ట్‌సిటీల నిర్మాణం వైపు అడుగులు పడుతున్నాయి. ఇదంతా బాగానే ఉన్నా, నగరాల్లో పరిస్థితులు మాత్రం నరకాన్ని తలపిస్తున్నాయి. నగర జనాభాలో 25శాతం మురికివాడల్లోనే నివసిస్తున్నారు. నగరాలు, పట్టణాల్లో తాగునీరు, మురుగునీటి పారుదల, రహదారుల వంటి కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయి. పట్టణీకరణకు అనుగుణంగా సరైన ప్రణాళికలు రూపొందించకపోవడం, ముందుచూపు లోపించడం, తగిన ఆర్థిక వనరులను సమకూర్చకపోవడంతో సమస్యలు తీవ్రమవుతున్నాయి.



హైదరాబాద్

ప్రధానంగా నీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, మంచి వాతావరణం, ప్రమాణాలతో కూడిన విద్య, వైద్య ఆరోగ్య వసతులు, భద్రత వంటి కీలకాంశాలపై శ్రద్ధ చూపకపోవడంతో- నగర, పట్టణవాసుల బతుకు బేజారవుతోంది. లక్ష్యంలో సగమైనా నీటిసరఫరా జరగడంలేదు. ప్రజారవాణా గరిష్ఠంగా 30శాతమే ఉంది. అది కనీసం 50శాతమైనా ఉండాలి. పూర్తిస్థాయిలో మురుగునీటి పారుదల వ్యవస్థ అవసరం. మన నగరాల్లో అది 30శాతం మాత్రమే. ఘనవ్యర్థాల నిర్వహణ 72శాతమే ఉంది.

మనదేశంలో పట్టణాలు, నగరాల్లో అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు చేస్తున్న వ్యయం ఇతర దేశాలతో పోలిస్తే చాలా తక్కువ. అది జీడీపీలో 0.5శాతమే. దేశంలో నగరాలు, పట్టణాల్లో తలసరి సగటు వార్షిక వ్యయం 50డాలర్లు. అందులో



విజయవాడ

17డాలర్లే మౌలిక సదుపాయాల కోసం వ్యయం చేస్తున్నారు. 33డాలర్లు నిర్వహణ వ్యయం. చైనాలో తలసరి సగటు వ్యయం 362 డాలర్లు. దక్షిణాఫ్రికాలో 508 డాలర్లు. ఇంగ్లండ్‌లో 1,772 డాలర్లు. జీడీపీలో రెండుశాతం నిధులు వ్యయం చేస్తే తప్ప మౌలిక వసతులు కల్పించడం సాధ్యంకాదని నిపుణులు స్పష్టంచేస్తున్నారు. అందుకు ప్రధాన అడ్డంకి- నిధుల కొరత. నగర, పట్టణ పాలక సంస్థలకు ఆస్తిపన్ను ప్రధాన ఆదాయ వనరుగా ఉంది. కీలక పన్నులన్నీ కేంద్ర ఖాతాల్లో చేరుతుండటంతో ఢిల్లీ దయాదాక్షిణ్యాలపైనే ప్రధానంగా ఆధారపడాల్సి వస్తోంది. నగరాలు, ప్రధాన పట్టణాలను దృష్టిలో ఉంచుకుని 2005లో తీసుకువచ్చిన జవహర్‌లాల్ నెహ్రూ జాతీయపట్టణ నవీకరణ పథకం(జేఎన్ఎన్‌యూఆర్ఎం) కింద రూ. 1.16లక్షల కోట్లు వ్యయం చేశారు. ఫలితంగా కొన్ని నగరాలు, పట్టణాల్లో కొంతమేరకు సౌకర్యాలు మెరుగుపడ్డాయి. పట్టణాలు, నగరాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాబోయే 20 ఏళ్లలో రూ. 39.2లక్షల కోట్లు కావాల్సి ఉంటుంది. ఇందులో 44శాతం రోడ్లకు 20శాతం తాగునీరు, మురుగునీరు, ఘనవ్యర్థాల నిర్వహణ, వరదనీటి కాలువలు, వీధి దీపాలకు: 14శాతం రవాణా ; ట్రాఫిక్ వ్యవస్థల మెరుగుదలకు; 10.5 శాతం మురికివాడల అభివృద్ధికి, మిగిలిన మొత్తం ఇతర అంశాలకోసం అవసరమని గుర్తించారు. పట్టణాలు, నగరాలు ప్రధానంగా తీవ్ర నీటిఎద్దడితో సతమతమవుతున్నాయి. అక్కడ నివసించే ప్రజలకు సరఫరా అవుతున్నది రోజుకు 66 లీటర్లే. ఇది జాతీయ సగటు 145 లీటర్లకంటే చాలా తక్కువ.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వందశాతం భూగర్భ డ్రైనేజీ సౌకర్యం ఉన్న మున్సిపాలిటీ ఏ ఒక్కటీ లేదు. పట్టణాల్లో 37శాతం గృహాలకే డ్రైనేజీ సౌకర్యం ఉంది. నేటికీ నగరాల్లో కాలువలే దిక్కు. నూరుశాతం భూగర్భ డ్రైనేజీతో పారిశుద్ధ్యంలో సగం లక్ష్యాన్ని సాధించినట్లే అవుతుంది. నీటిశుద్ధి వ్యవస్థలను నెలకొల్పడంలోనూ మనది వెనకంజే. విడుదలవుతున్న మురుగునీటిలో పదిశాతమైనా శుద్ధి చేయడంలేదు. ఫలితంగా నగరాలు, పట్టణాలు కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి. ఘనవ్యర్థాల నిర్వహణా అంతంత మాత్రంగా ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని 124 నగరాలు, పట్టణాల్లో సుమారు 7,451 మురికివాడలు ఉన్నాయి. అక్కడ నివసిస్తున్న కోటిమందికి పైగా ఎలాంటి కనీస వసతులు లేకుండా జీవనం సాగిస్తున్నారు. నిరక్షరాస్యత, అనారోగ్యం, పోషకాహారలోపంతో బాధపడు తున్నారు. తాగునీరు, మురుగునీటి వ్యవస్థ, రహదారుల వంటి కనీస వసతులూ వారికి కొరతే. ఈ మురికివాడల్లో సగమందికి కనీసం తాగునీరైనా లేదు. 25శాతానికే మురుగునీటి పారుదల వసతి ఉంది. 60శాతం మురికివాడల జనం కొళాయిల వద్ద నీటిపోరాటాలు చేయాల్సిందే. సగం మురికివాడలు ప్రమాదకర

**పట్టణీకరణ శాతం**

| తెలంగాణలో... జిల్లా | 2001 జనాభా | 2011 జనాభా | ఆంధ్రప్రదేశ్‌లో... జిల్లా | 2001 జనాభా | 2011 జనాభా |
|---|---|---|---|---|---|
| హైదరాబాద్ | 100 | 100 | విశాఖ | 39.95 | 47.51 |
| రంగారెడ్డి | 54.20 | 70.32 | కృష్ణా | 32.08 | 41.01 |
| వరంగల్ | 19.2 | 28.34 | కడప | 22.59 | 34.10 |
| ఆదిలాబాద్ | 26.53 | 27.68 | గుంటూరు | 28.80 | 33.89 |
| కరీంనగర్ | 19.44 | 26.08 | చిత్తూరు | 21.65 | 29.47 |
| మెదక్ | 14.36 | 24.02 | నెల్లూరు | 22.45 | 29.07 |
| ఖమ్మం | 19.81 | 23.43 | కర్నూలు | 23.16 | 28.26 |
| నిజామాబాద్ | 18.11 | 23.03 | అనంతపురం | 25.26 | 28.09 |
| మహబూబ్‌నగర్ | 10.57 | 15.00 | తూర్పుగోదావరి | 23.50 | 25.52 |
| నల్గొండ | 13.32 | 19.00 | విజయనగరం | 18.33 | 20.93 |
| | | | పశ్చిమగోదావరి | 19.74 | 20.55 |
| | | | ప్రకాశం | 15.28 | 19.52 |
| | | | శ్రీకాకుళం | 10.98 | 16.16 |

పరిస్థితుల్లో ఉన్నాయి. 2014నాటికి మురికివాడల్లోని వారందరికీ గౌరవంగా జీవించేలా నాణ్యతతో కూడిన కనీస వసతులు కల్పిస్తామని, నివాసప్రాంతాలపై హక్కుతో పాటు పేదరిక నిర్మూలన, మెరుగైన జీవనం గడిపేందుకు అనువైన పరిస్థితులు ఏర్పరుస్తామని 2009లో ఉమ్మడి రాష్ట్రంలో నిర్ణయించారు. ఆ దిశలో ఒక్క అడుగూ ముందుకు పడలేదు. దీన్నిబట్టి ప్రభుత్వాల చిత్తశుద్ధి ఏపాటిదో అర్థంచేసుకోవచ్చు. మురికివాడల్లేని పట్టణాల కోసం తెచ్చిన రాజీవ్ ఆవాస్ యోజన, లక్ష్యసాధనలో చతికిలపడింది.

### మౌలికవసతుల విస్తరణ ముఖ్యం

పరిస్థితి ఇప్పటికైనా మెరుగుపడాలంటే పట్టణ మౌలిక సదుపాయాలను విస్తరించాలి. సేవల్లో నాణ్యతను పెంపొందించాలి. పట్టణ రవాణాకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. యువతలో నైపుణ్యం పెంపొందించాలి. ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలి. భూ వినియోగం, పట్టణ ప్రణాళిక, నగర ప్రణాళికలను రూపొందించుకోవాలి. మురికివాడల అభివృద్ధికి, తక్కువ ఆదాయ వర్గాల ఇళ్ల నిర్మాణానికి పెద్దపీట వేయాలి. సేవారంగంలో సంస్కరణలు తీసుకువచ్చి ఈ-గవర్నెన్స్ వంటి విధానాలను మరింత విస్తరించాలి. పన్నుల విధానంలో సంస్కరణలు తెచ్చి పట్టణ, నగర పాలకసంస్థలకు న్యాయబద్ధమైన వాటా ఉండేలా చూడాలి. ■

## నగరాలు, పట్టణాల్లో ఇవీ లక్ష్యాలు

| | |
|---|---|
| నీటి సరఫరా | : పైపుల ద్వారా, 24 గంటలూ. ఒక్కొక్కరికి రోజుకు 145 లీటర్లు. |
| పారిశుద్ధ్యం, మురుగునీటి నిర్వహణ | : వందశాతం భూగర్భ డ్రైనేజీ, మురుగునీటిని సేకరించి శుద్ధి చేయడం. |
| ఘన వ్యర్థాలు | : వంద శాతం సేకరణ, రవాణా, శుద్ధి, వినియోగం. |
| పట్టణ రోడ్లు | : నగరాల్లో 11శాతం, పట్టణాల్లో ఏడుశాతం విస్తీర్ణంలో రోడ్లు ఉండాలి. |
| వరదనీటి కాలువలు | : రోడ్లకు ఇరువైపులా నాలాలు ఉండాలి. |
| పట్టణ రవాణా | : పది లక్షల జనాభా దాటిన నగరాల్లో రైలు, రోడ్డ ఆధారిత ప్రజారవాణా వ్యవస్థ ఉండాలి. |
| వీధి దీపాలు | : అన్ని నగరాలు, పట్టణాల్లో ప్రధాన రోడ్లలో 40మీటర్ల అంతరంలో అత్యాధునిక వీధి దీపాలు ఏర్పాటుచేయాలి. |
| ట్రాఫిక్ రద్దీ | : ట్రాఫిక్ నిర్వహణకు మౌలిక సదుపాయాలు ఏర్పరచాలి. |

### మనదేశంలో ఇలా...

2031నాటికి నగరాలు, పట్టణాల్లో 60కోట్లమంది నివసిస్తారు.
నగరాలు, పట్టణాల్లో పనిచేసే వయసులో 27కోట్లమంది ఉంటారు.
70శాతం కొత్త ఉపాధి అవకాశాలు నగరాల్లో రానున్నాయి.
68 నగరాలు పదిలక్షల జనాభాను దాటుతాయి
ఏటా 70కోట్ల నుంచి 90కోట్ల చదరపు మీటర్లలో వాణిజ్య, గృహవసతి అవసరమవుతుంది.

## మేమున్నాం


తుపాను ప్రభావిత ప్రాంతాలను మంగళవారం విమానంలోంచి పరిశీలిస్తున్న మోదీ

హుద్‌హుద్ తుపాను కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో సహాయ, పునరావాస చర్యలు చేపట్టడానికి తక్షణ సాయంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెయ్యికోట్ల రూపాయలు ప్రకటించారు. సర్వే అయిన తర్వాత పూర్తిస్థాయి సాయం అందిస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి హామీ ఇచ్చారు. విద్యుత్తు, తాగునీటి సరఫరా, కమ్యూనికేషన్ల వ్యవస్థ పునరుద్ధరణే తమ ప్రాథమిక కర్తవ్యమని చెప్పారు. హుద్‌హుద్ తుపాను తాకిడికి శిథిలంగా మారిన విశాఖపట్నాన్ని పరిశీలించారు. “మొన్న వచ్చిన భయంకర తుపాను కారణంగా ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలతోపాటు ఒడిశా కష్టాలపాలయ్యాయి. కొందరు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. ఇబ్బందుల్లో ఉన్న సోదర, సోదరీమణులందరికీ నేను సానుభూతి తెలుపుతున్నా. ఇలాంటి క్లిష్టపరిస్థితుల్లో దేశం మొత్తం, కేంద్ర ప్రభుత్వం... ఆంధ్రప్రదేశ్, ముఖ్యంగా వైజాగ్ ప్రజలకు పూర్తి అండగా నిలుస్తాయి. కేంద్ర ప్రభుత్వం అవసరమైనంత పూర్తి సాయం అందిస్తుందని ప్రకటించారు.



# రేడియో అక్కయ్య ఇకలేరు..

## అస్వస్థతతో హైదరాబాద్ కిమ్స్‌లో తురగా జానకీరాణి కన్నుమూత

ఆకాశవాణిలో ''రేడియో అక్కయ్య''గా సుపరిచితురాలైన తురగా జానకీరాణి(78) అస్వస్థతతో హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆమె కొంత కాలంగా మధుమేహంతో బాధపడుతున్నారు. ఇటీవల కాలికి గాయం కావడంతో కుటుంబ సభ్యులు ఆమెను సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆరోగ్య పరిస్థితి విషమించింది. గుండె పనిచేయడం మానేయడంతో ఆమె కన్నుమూసినట్లు వైద్యులు ప్రకటించారు. మృతదేహాన్ని బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 3లోని జర్నలిస్టుకాలనీకి తరలించారు. అంత్యక్రియలు నిర్వహించ నున్నట్లు కుటుంబ సభ్యులు ప్రకటించారు. ఆమె మృతి వార్త తెలియడంతో అభిమానులు, సాహితీవేత్తలు విషాదంలో మునిగిపోయారు.

జానకీరాణి 1936 ఆగస్టు 31న మచిలీపట్నంలో జన్మించారు. ప్రముఖ జర్నలిస్టు కృష్ణమోహన్‌తో 1959లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు. 1974లో జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త కృష్ణమోహన్ మృతిచెందారు. 1975లో ఆకాశవాణిలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన జానకీరాణి 1994లో సహాయ సంచాలకురాలి హోదాలో పదవీ విరమణ చేశారు. రేడియో పాటలు, నాటికలు, రూపకాలు వంటి ఎన్నో కార్యక్రమాలను రూపొందించారు. చిన్నారుల్లో సృజనను పెంచడానికి, మైక్ ముందు ధైర్యంగా మాట్లాడటానికి "బాలానందం"కార్యక్రమాన్ని వేదికగా మలిచారు. సినీ ప్రముఖులు అక్కినేని నాగేశ్వరరావు, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, జె.వి.సోమయాజులు, మంజు భార్గవి తదితరులతో కలిసి కార్యక్రమాలకు రూపకల్పన చేశారు.

# మౌలిక సంస్కరణలపై మహిళల్లో ఆలోచన పెంచిన జానకిరాణి: లోక్‌సత్తా నివాళి

లోక్‌సత్తా ఉద్యమ జీవితకాల సభ్యురాలు, లోక్‌సత్తా భావజాల పత్రిక 'జనబలం' సంపాదకవర్గ సభ్యురాలు తురగా జానకిరాణి మృతి పట్ల లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షులు డి.వి.వి.ఎస్ వర్మ, బండారు రామ్మోహనరావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆమె మృతి లోక్‌సత్తా కుటుంబానికి, సమాజానికి లోటని జేపీ అన్నారు. లోక్‌సత్తా కార్యక్రమాలలో జానకిరాణి క్రియాశీలక పాత్ర నిర్వహించారని, మౌలిక రాజకీయ, ఆర్థిక, పాలనా సంస్కరణల కోసం లోక్‌సత్తా చేస్తున్న కృషిలో భాగస్వాములయ్యేలా పలువురు మహిళలను ఆలోచింప చేశారని అన్నారు.

లోక్‌సత్తా ఉద్యమ ప్రారంభం నుంచి జానకి రాణి మమేకమై పనిచేశారు. పౌరులకు ప్రభుత్వ సేవల్ని ఒక హక్కుగా అందించేందుకు దేశంలోనే తొలిసారిగా 1998లో లోక్‌సత్తా రూపొందించిన పౌరసేవల పత్రం (స్వరాజ్యం) ప్రచారంలో, ఎన్నికల నిఘాలో భాగంగా 1999లో రాష్ట్రవ్యాప్తంగా అనేకచోట్ల వివిధ పార్టీల అభ్యర్థులతో లోక్‌సత్తా నిర్వహించిన ఉమ్మడి వేదిక కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. స్థానిక ప్రభుత్వాలలో మహిళా ప్రజాప్రతినిధుల సాధికారత కోసం చేస్తున్న కృషిలో భాగంగా 2002లో కృష్ణా, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో లోక్‌సత్తా నిర్వహించిన శిక్షణా కార్యక్రమాలలో మహిళా వార్డు మెంబర్లు, సర్పంచులు, జడ్పీటీసీ, ఎంపీటీసీలకు జానకి రాణి శిక్షణ ఇచ్చారు. స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాల కోసం దేశ చరిత్రలోనే తొలిసారిగా రాష్ట్రంలో 1 కోటీ 8 లక్షల సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టటానికి సన్నాహకంగా 2003లో హైదరాబాద్‌లో లోక్‌సత్తా నిర్వహించిన స్థానిక ప్రజాప్రతినిధుల సమావేశంలో కూడా ఆమె చురుకైన పాత్ర పోషించారు. 2006లో ఆవిర్భవించిన లోక్‌సత్తా పార్టీకి ఆమె సహాయసహకారాల్ని అందిస్తున్నారు. లోక్‌సత్తా భావజాలం పట్ల మంచి అవగాహన ఉన్న జానకిరాణి, జనబలం పత్రికకి పలు వ్యాసాలు అందించారు.

జర్నలిస్టు కాలనీలోని జానకి రాణి స్వగృహంలో భౌతిక కాయాన్ని లోక్‌సత్తా పార్టీ నేతలు బండారు రామ్మోహనరావు, గోవిందరావు, జట్టి రవి, శివరామకృష్ణ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# గాంధీజీ ప్రేరణతో జపాన్ "సౌజీ"

- ప్రతి విద్యార్థీ చీపురు పట్టాల్సిందే
- పాఠశాల పరిశుభ్రత బాధ్యత వారిదే
- నిత్యకృత్యంగా అమలు

ఎక్కడ పరిశుభ్రత ఉంటే అక్కడ దేవుడు సాక్షాత్కరిస్తారన్నది గాంధీజీ సిద్ధాంతం. దాన్ని ఆచరణలో పెట్టడానికి ప్రధాని నరేంద్రమోదీ ఇప్పుడు స్వచ్ఛభారత్ ఉద్యమానికి పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ వారానికి రెండుగంటలు ఇందుకోసం కేటాయించాలని కోరారు. మనదేశం మాట ఎలా ఉన్నా జపాన్ మాత్రం గాంధీ బోధనలను ఎప్పటి నుంచో అమలు చేస్తోంది. సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలకు నిలయమైన ఆ దేశం పారిశుద్ధ్యాన్ని విద్యాబోధనలో భాగంగా చేసింది. దీన్ని ఓ పవిత్ర కార్యక్రమంగా చూస్తోంది. పాఠశాల దశ నుంచే విద్యార్థులకు ఇందులో భాగస్వామ్యం కలిపిస్తోంది. కేవలం పాఠాలకు పరిమితం చేయకుండా ఆచరణలో చేసి చూపిస్తోంది.

%“%సౌజీ%“% పేరుతో రోజూ సాయంత్రం పాఠశాల ముగిసే సమయంలో విద్యార్థులతోనే మరుగుదొడ్లతో సహ పాఠశాల ఆవరణ మొత్తాన్ని శుభ్రం చేయించడం అక్కడి బోధనలో ఓ భాగం. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పాఠశాలలో చేరిన చిన్నపిల్లాడు మొదలు ఆ ప్రాంగణంలో చదువుతున్న పై తరగతి విద్యార్థివరకు అందరూ ఒళ్లు వంచి పనిచేయాల్సిందే. అక్కడ పాఠశాలలను పరిశుభ్రం చేయడానికి ప్రత్యేకంగా ఉద్యోగులంటూ ఉండరు. ప్రతి రోజూ 15-30 నిమిషాలపాటు ప్రతి విద్యార్థి తనకు అప్పగించిన ఏదో ఒక శుభ్రతా కార్యక్రమంలో పాలుపంచుకోవాల్సిందే. వారానికి నాలుగు రోజులు ఈ కార్యక్రమం జరుగుతుంది. బుధవారం లేదంటే శనివారాలు మాత్రం ఈ పనిచేయరు. ప్రతి సెమిస్టర్ చివరి రోజున భారీగా ఈ కార్యక్రమం చేపడతారు. ఆ పని జరుగుతున్నంత సేపూ విద్యార్థుల్లో ఉత్సాహాన్ని రేకెత్తించే ఆకర్షణీయమైన సంగీతం వినిపిస్తూ ఉంటారు. ఒక తరగతి విద్యార్థులకు.. తమ గదితో పాటు పాఠశాల ప్రాంగణంలోని మరో రెండు ప్రాంతాల పారిశుద్ధ్య బాధ్యతలను అప్పగిస్తారు. ఇందుకోసం వారిని నాలుగు చిన్న బృందాలుగా విభజిస్తారు.



ఆరోతరగతి విద్యార్థులకు చెందిన ఓ బృందాన్ని ఒకటో తరగతి చదివే చిన్నారులవద్దకు పంపి తరగతి గదిని ఎలా శుభ్రం చేసుకోవాలో నేర్పుతారు. జపాన్‌లో చాలామంది చిన్నారులకు తోబుట్టువులు ఉండరు. అందువల్ల మానవ సంబంధాలు పెంపొందింపచేయడానికి పెద్ద పిల్లలతో చిన్న పిల్లలు పాల్గనేలా కార్యక్రమాన్ని రూపొందిస్తారు. ఏడాదిలో మూడుసార్లు పాఠశాల చుట్టుపక్కల ప్రాంతాలను కూడా శుభ్రం చేస్తారు. మూడోతరగతిపైన చదివే పిల్లలకు ఈ బాధ్యతలు అప్పగిస్తారు. విద్యార్థులంతా ఆడుతూపాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గంటారు కాబట్టి ఎవ్వరూ ఆలసిపోరు. మరుగుదొడ్లు మొదలుకొని పాఠశాల ప్రాంగణంలోని ప్రతి మూలనూ రోజూ తరగతులు అయిపోయాక శుభ్రపరచుకోవడం జపాన్‌లో అలవాటుగా మారిపోయింది. ప్రపంచానికి సాంకేతిక గురువుగా ఎదిగినప్పటికీ పిల్లలతో శుభ్రం చేయించేటప్పుడు వ్యాక్యూమ్ క్లీనర్‌లాంటి యంత్రాలేవీ ఉపయోగించరు. అందరూ సంప్రదాయ పద్ధతుల్లో చీపుర్లతో వూడ్చడంతోపాటు, ఒళ్లు వంచి తడి వస్త్రంతో గచ్చులను తుడవాల్సిందే. జపాన్ భాషలో "సౌజీ" అని పిలిచే ఈ పరిశుభ్రతా కార్యక్రమంవల్ల రెండు ప్రయోజనాలున్నాయి. పరిసరాలను ఎలా శుభ్రంగా ఉంచుకోవాలో నేర్పడం అందులో ఒకటైతే, పరస్పరం ఎలా సహకరించుకోవాలో తెలియజేయడం రెండోది. బృందాలుగా కలిసిపోయి వేగంగా ఎలా పనిచేయాలో నేర్పించేలా ఈ శుభ్రతా కార్యక్రమానికి ప్రతిరోజూ అరగంటలోపు సమయాన్ని కేటాయిస్తున్నారు. ■

# స్వచ్ఛ్‌భారత్ - సవాళ్లు

- శిరమని నరేష్

**2019** అక్టోబర్2, నాటికి మన దేశాన్ని స్వచ్ఛ్ భారత్‌గా మార్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ్ భారత్ కార్యక్రమాన్ని మొదలుపెట్టడం మనందరం హర్షించదగిన విషయం. బహిరంగ మల విసర్జన గురించి, బహిర్భూమికి వెళ్తున్న మహిళల కష్టాల గురించి గత పదిహేడు సంవత్సరాలుగా లోక్‌సత్తా ఉద్యమం, లోక్‌సత్తా పార్టీ నిర్వహించిన దాదాపు ప్రతి సమావేశంలోను జేపీ ప్రస్తావిస్తూనే ఉన్నారు. కొత్త కోడలు అత్తవారింటికి వెళ్లిన తొలినాళ్ళలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు పడే కష్టాలని జేపీ తన ప్రతి ప్రసంగంలో తప్పనిసరిగా ప్రస్తావించేవారు. ఇప్పుడు ఒక ప్రధానమంత్రి తన ఎర్రకోట ప్రసంగంలో ఇంత మౌలికమైన అంశాన్ని ప్రస్తావించడం, స్వచ్ఛ్ భారత్ కోసం పిలుపునివ్వడం ఆహ్వానించదగిన పరిణామం. ప్రధాని పిలుపు నిచ్చినట్లు, ప్రభుత్వం సంకల్పించినట్లు అయిదేళ్లలో మన దేశం పరిశుభ్రమైన దేశంగా మారడానికి ఉన్న అడ్డంకులు, అధిగమించే మార్గాలని ఒకసారి చూద్దాం.




పారిశుధ్యంపై జాతీయ రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించడం, పథకాలు ప్రకటించడం ఇదే తొలిసారి కాదు. ఎన్నో దశాబ్దాలుగా ప్రభుత్వం పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి. క్షేత్రస్థాయిలో మార్పులు సాధించేందుకు కేంద్రం స్థాయిలో ప్రకటించిన పథకాలు, కార్యక్రమాలు కనీసం 50 శాతం లక్ష్యాలని కూడా సాధించలేదు. (ఒక్కపల్స్ పోలియో తప్ప) పల్స్ పోలియో అనేది సంవత్సరానికి రెండు సార్లు చేపట్టే కార్యక్రమం కాబట్టి విజయవంతం అయింది. కానీ పారిశుధ్యం అనేది నిరంతరం కొనసాగాల్సిన ప్రక్రియ. పరిసరాల పరిశుభ్రత మన జీవన విధానంలో భాగం అయితే తప్ప మార్పు సాధించలేము.

ఇంత క్లిష్టమయిన సమస్యను పరిష్కరించడానికి 1. ప్రచారం, 2. భారీగా నిధుల కేటాయింపు, 3. ప్రజలని కార్పొరేట్ సంస్థలని భాగస్వాములను చెయ్యడం అనే మూడు మార్గాలని ప్రభుత్వం ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. ఈ మూడు అవసరమే. అయినా వీటన్నిటి కన్నా ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం అనేది చాలా ముఖ్యం.

### స్థానిక ప్రభుత్వాలకి అధికారం

125 కోట్ల ప్రజల గురించి మాట్లాడుతున్న మోదీ, వీరందరికీ ప్రాతినిధ్యం వహించే రెండున్నర లక్షలమంది గ్రామపంచాయతీ సర్పంచ్‌లు, అనేక లక్షల మంది వార్డు మెంబర్లు, వేలాది మంది మునిసిపల్ ఛైర్‌పర్సన్లు, మేయర్ల గురించి ఇంతవరకు ప్రస్తావించలేదు. సంసద్ అదర్శగ్రామ యోజనని ప్రారంభించిన ప్రధాని, ఎంపిలు గ్రామాలని అభివృద్ధి చేయాలని చెబుతున్నారే గాని, సర్పంచ్‌లని బాధ్యులని చెయ్యడం లేదు. పంచాయితీల బలోపేతం గురించి మాట్లాడడం లేదు. ప్రధాని కలలు కంటున్నట్లు, మనందరం కోరుకుంటున్నట్లు స్వచ్ఛ భారతం ఆవిష్కృతమవ్వాలంటే స్థానిక ప్రభుత్వాల బలోపేతం తప్పనిసరి. సర్పంచ్‌లు, గ్రామ పెద్దలు పూనుకోవడం వల్ల మన ఆదర్శ గ్రామాలుగా ఎదిగిన ఎన్నో గ్రామాలు ఉన్నాయి. అంతేగాని ఎమ్మెల్యేలు, ఎంపీల పూనికతో ఆదర్శంగా ఎదిగిన గ్రామాలు మనకి కనిపించవు.

### రాష్ట్రాల భాగస్వామ్యం

ఆగస్టు పదిహేనున తన ప్రసంగంలో పారిశుధ్యం విషయాన్ని ప్రస్తావించిన మోదీ అక్టోబర్ రెండున ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ నలభై ఐదు రోజుల వ్యవధిలో స్వచ్ఛభారత్ అంశంపై రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలు తీసుకుని ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తే బాగుండేది. ఇప్పుడు స్వచ్ఛ్ భారత్

అనేది మోది ప్రభుత్వం కార్యక్రమంలా మారిపోయింది. రాజకీయంగా స్వతంత్రంగా ఎదుగుదామని ఆశపడుతున్న నవీన్‌పట్నాయక్, మమతబెనర్జీ, కెసిఆర్‌లాంటి వారు ముఖ్యమంత్రులుగా ఉన్న రాష్ట్రాలు ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నాయి. ఇప్పటికయినా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహించి అందరిని కలుపుకుని ముందుకు వెళ్ళడం చాలా అవసరం.

### చంద్రబాబు ఫెయిల్యూర్ స్టోరీ

జీవితంలో ఎదగడానికి విజేతల కథలే కాదు. పరాజితుల అనుభవాలని కూడా తెలుసుకోవాలని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అన్నారు. పదిహేడేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పచ్చదనం – పరిశుభ్రం పేరుతో చంద్రబాబు చేసిన హడావిడి అంతా ఇంతా కాదు. అప్పుడు కూడా ముఖ్యమంత్రి మొదలు సినీ తారలు, స్కూల్ పిల్లలు వరకు అందరు చీపుర్లు పట్టారు. మట్టి తట్టలు మోశారు. కొన్నేళ్ళు కొనసాగిన ఈ కార్యక్రమం వల్ల ఆశించిన ఫలితాలు రాలేదు. క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం ఎందుకు విఫలమయిందో మోదీ చంద్రబాబును అడిగి తెలుసుకుంటే బాగుండేది.

### పాఠశాలల్లో మరుగుదొడ్లు

వచ్చే ఆగస్టు 15 కల్లా దేశంలోని అన్ని పాఠశాలలో మరుగుదొడ్లు, నిర్మించాలని కేంద్రం సంకల్పించింది. ఈ సంకల్పం మంచిదే. కానీ కేవలం మరుగుదొడ్లు నిర్మిస్తే సరిపోదు. వాటి నిర్మాణానికి తగిన ఏర్పాటు ఉండాలి. మరుగుదొడ్లతోపాటు నీటి వసతి ఏర్పాటు చేయాలి. మరుగుదొడ్ల నిర్వహణ, స్కూళ్ళలో పారిశుధ్యం కోసం తగినంత సిబ్బందిని నియమించాలి.

గ్రామీణ, ఉపాధి పథకం చేపట్టే పనులలో పాఠశాల పరిశుభ్రత అంశాన్ని కూడా చేర్చాలి. ఒక మూడు సంవత్సరాల పాటు బయట వ్యక్తుల సహాయంతో పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ చేపట్టాలి. క్రమేణా విద్యార్థులే తమ పాఠశాలల్ని శుభ్రపరచుకొనే అలవాటు చెయ్యాలి.

### నగరాల్లో పారిశుధ్యం

నగరాల్లో పారిశుధ్యం మెరుగుపడాలంటే కాలనీ సంక్షేమ సంఘాలు, బస్తీ సంఘాలను భాగస్వాములను చేయాలి. హైదరాబాద్ లాంటి నగరాల్లో ఇంటింటికి తిరిగి చెత్త సేకరించే రిక్షాలు ఉన్నాయి. చెత్త రిక్షా వాళ్ళు ఇంటికి 30 నుండి 50/– వరకు వసూలు చేసుకుంటుంటారు. అయితే కొంతమంది గృహ యజమానులు ఈ దబ్బుకి కూడా కక్కుర్తిపడి రోడ్లపై చెత్త పడేస్తుంటారు. ఇలాంటివి అరికట్టాలంటే నగరపాలక సంస్థలే ఆస్తిపన్నుతోపాటు చెత్తసేకరణ రుసుము కూడా వసూలు చేసి, గృహయజమానులకు నెలవారీ కూపన్లు ఇవ్వాలి. చెత్త సేకరించే రిక్షావాళ్ళకు గృహ యజమానులు ప్రతినెలా కూపన్ల రూపంలో చెల్లించే ఏర్పాటు చేస్తే 100 శాతం ఇళ్ళ నుండి, షాపుల నుండి చెత్త సేకరించడం సాధ్యం అవుతుంది. వాణిజ్య ప్రాంతాలలో కూడా పారిశుధ్య సంఘాలను ఏర్పరచి వారికి బాధ్యతలు అప్పగించాలని ప్రజలందరికీ సౌకర్యంగా ఉండేలా పబ్లిక్‌టాయిలెట్స్‌ను నిర్మించి, నిర్వహించాలి.

### ఈవెంట్ కాదు... మూవ్‌మెంట్ కావాలి

అక్టోబర్ 2న చీపురు పట్టిన మోది, మరో తొమ్మిది మంది ప్రముఖుల్ని ఈ పని చేయమని అప్పగించారు. సచిన్, అనిల్ అంబానీలు ఈ పిలుపుకి స్పందించి చీపుర్లు పట్టి రోడ్లను శుభ్రం చేశారు. ఇంకా ఎంతో మంది ముందుకు వస్తున్నారు. అయితే ఇవన్నీ ఒకరోజు ఈవెంట్‌లలాగా జరిగితే అంత ప్రయోజనం ఉండదు. ప్రతి ఒక్కరు వారానికి రెండు గంటల చొప్పున సంవత్సరానికి 100 గంటలు పారిశుధ్యం కోసం కేటాయించమని కోరిన మోది, అక్టోబర్ 2 తర్వాత మళ్ళీ స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొనలేదు. రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా ఒకరోజు ఫొటోలకి ఫోజులిచ్చి అంతటితో సరిపుచ్చారు.

### ఆదర్శం, అవసరం

రాహుల్ గాంధీ , సోనియా గాంధీలను చూస్తూ పెరిగిన ఈ తరానికి మహాత్మాగాంధీని ఆదర్శంగా చూపి పారిశుధ్యం వైపు మళ్ళించాలని మోది తలపోస్తున్నారు. అందుకే మహాత్మగాంధీ 150 వ జయంతి నాటికి స్వచ్ఛ్ భారతాన్ని నిర్మించి ఆయనకు కానుకగా ఇద్దాం అని ఉద్బోధిస్తున్నారు. ప్రభుత్వం చేస్తున్న ప్రచారం కూడా మహాత్మగాంధీ చుట్టూనే తిరుగుతోంది. ఇది అవసరమే గాని సరిపోదు. పరిసరాల పరిశుభ్రత మన ఆరోగ్యానికి సంబంధించిన విషయం. మనం ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి అనే విషయాన్ని చాలా బలంగా, హృదయాలకు హత్తుకునేలా ప్రచారం చెయ్యాలి.. దీనితోపాటు స్వచ్ఛ్‌భారత్ ఉద్యమంలో వ్యక్తిగతంగా, చిన్న చిన్న బృందాలుగా ఎలా పాల్గొనవచ్చు, మంచి ఫలితాలు ఎలా సాధించవచ్చు, అనే అంశాలు ప్రచారం చేయాలి.

రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక ప్రభుత్వాలను భాగస్వాములను చేస్తూ, దేశవిదేశాల్లో ఉన్న మంచి పద్ధతుల నుండి పాఠాలు నేర్చుకుంటూ స్వచ్ఛభారత్‌ను సాకారం చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఆశిద్దాం. ఈ మహా యజ్ఞంలో మనమూ పాల్గొందాం. ■





గాంధీజయంతి, లోక్‌సత్తా పార్టీ ఆవిర్భావ దినోత్సవం దృశ్యాలు









స్వచ్ఛ్ భారత్ ఛాలెంజ్





RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2013-15 Published on October 16th, 2014



హుద్ హుద్ తుఫానులో ధ్వంసమైన అరటితోట

| Book-Post<br>PRINTED MATTER | To, |
|---|---|
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad